ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు


TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..





'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889



మేడ్చల్ | బుధవారం | 10.12.2025 | సంపుటి : 1 | సంచిక : 165 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్




08

## అన్మోల్ అంబానీపై సీబీఐ కేసు



08

## కొనసాగిన స్టాక్ మార్కెట్ నష్టాలు



06

## జపాన్‌లో భారీ భూకంపం

- రిక్టార్ స్కేల్‌పై 7.2 తీవ్రత నమోదు
- భారీగా ఎగసిపడుతున్న రాకాసి అలలు

# రెండో రోజు పెట్టుబడుల వెల్లువ

## ఫుడ్ ప్రాసెసింగ్ డేటాసెంటర్లు

### ఫార్మా సెక్టార్ క్లీన్ ఎనర్జీలో భారీ ప్రాజెక్టులు.. సిఎం కార్యాలయం వెల్లడి

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో రెండో రోజు వివిధ కంపెనీల ప్రతినిధులు తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. వారితో సమావేశమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఉద్యోగాలు పెంపునకు వచ్చిన భారీ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడనున్నాయని అధికారులు పేర్కొన్నారు.

02



## తెలంగాణ మట్టిలోనే గొప్ప చైతన్యం

### 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

పేదల్లో నిరుపేదలకు సహాయానికే ప్రాధాన్యం

విజన్ డాక్యుమెంట్-2047 రూపకల్పనలో అందరి భాగస్వామ్యం

ఆవిష్కరణ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,డిసెంబర్9 : తెలంగాణ మట్టిలోనే గొప్ప చైతన్యం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యమని సీఎం రేవంత్

-మిగతా 2 లో



02

## భారత్‌లో రూ.1.5 లక్షల కోట్ల పెట్టుబడి

### మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల ప్రకటన

ప్రధాని మోడీతో భేటీలో పలు అంశాలపై చర్చ

స్వాగతించిన ప్రధాని మోడీ

మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల మంగళవారం ప్రధాని నరేంద్రమోడీతో భేటీ అయ్యారు. ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడిన ఇండియాలో పెడుతున్నట్లు సత్య నాదెళ్ల ప్రకటించారు. ఇది భారతదేశ ఆశయాలకు మద్దతు ఇస్తుందని చెప్పారు. భారతదేశ ఎఐ ఫస్ట్ ఫ్యూచర్' నిర్మించేందుకు, డెవలప్ చేసేందుకు శ్రీ17.5 బిలియన్లు అంటే రూ. 1.5 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టడానికి కట్టుబడి ఉన్నట్లు వెల్లడించారు.



## భారీగా ఉద్యోగాల కల్పనే లక్ష్యం

### అందుకు అనుగుణంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం

13,500 ఎకరాల్లో గ్రీన్ సిటీగా అభివృద్ధి

ఏఐ సిటీ, హెల్త్ సిటీ, స్పోర్ట్స్ హబ్ అభివృద్ధి

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో ఐటి మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,డిసెంబర్9 : భారీగా ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. నెట్ జీరో కార్బన్ సిటీగా

-మిగతా 2 లో..

## ఇండిగోకు కేంద్రం గట్టి షాక్

### ఇండిగో షెడ్యూళ్లలో 10 శాతం కోత

పౌరవిమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడు

ప్రయాణికుల ఇబ్బందికి చింతిస్తున్నా: సీఈఓ

దేశవ్యాప్తంగా ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఇండిగోకు కేంద్రం గట్టి షాక్ ఇచ్చింది. ఇండిగో షెడ్యూళ్లలో 10 శాతం కోత విధిస్తున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. తద్వారా విమాన సేవలను స్థిరీకరించడం సాధ్యమవుతుందన్నారు. ఇండిగో సేవలపై వివరణ కోరేందుకు సీఈఓ పీటర్ ఎల్బర్స్‌కు మంగళవారం పౌరవిమానయాన శాఖ సమన్లు జారీ చేసింది.



న్యూఢిల్లీ,డిసెంబర్9 : ఈ భేటీ అనంతరం మంత్రి తన నిర్ణయం ప్రకటించారు. ఇండిగో అంతర్గత నిర్వహణలో


-మిగతా 2 లో..

## తెలంగాణ టెన్త్ పరీక్షల షెడ్యూల్ విడుదల

### మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు

ఒక్కో పరీక్షకు మూడురోజుల గ్యాప్

తెలంగాణలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. 2026 మార్చి నెల 14వ తేదీ నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలంగాణ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ మంగళవారం అధికారికంగా ప్రకటించింది.



హైదరాబాద్, డిసెంబర్ 9 : పరీక్షల నిర్వహణకు సంబంధించి పూర్తి టైమ్‌టేబుల్‌ను విడుదల చేస్తూ, విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఎస్ఎస్‌సీ బోర్డు షెడ్యూల్ విడుదల

-మిగతా 2 లో..



## సోనియా గాంధీకి కోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీకి కోర్టు నోటీసులు జారీ అయ్యాయి. భారత పౌరసత్వం రాక ముందే ఆమె పేరును ఓటరు జాబితాలో చేర్చారన్న ఆరోపణల నేపథ్యంలో దాఖలైన పిటిషన్‌పై రౌజ్ అవెన్యూలోని సెషన్స్ కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. అనంతరం సెషన్స్ కోర్టు సోనియాకు నోటీసులు జారీ చేసింది.

## రాజ్యాంగాన్ని గుప్పిట్లో పెట్టుకునే కుట్ర

### ఆర్ఎస్ఎస్ చేతుల్లోకి రాజ్యాంగ వ్యవస్థలు

సర్‌పై చర్చలో రాహుల్ ఘాటు విమర్శలు



న్యూఢిల్లీ, డిసెంబర్ 9 : రాజ్యాంగ వ్యవస్థలను చేతుల్లోకి తీసుకోవడమే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఎజెండా అని, ఆ ఎజెండానే ప్రభుత్వం అమలు చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై మంగళవారం నాడు లోక్‌సభలో జరిగిన చర్చలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ వాదులకు సమానత్వంపై నమ్మకం లేదని, అన్ని వ్యవస్థలపైనా ఆధిపత్యం చూపుతున్నారని విమర్శించారు. ఎన్నికల వ్యవస్థను సైతం ఆర్ఎస్ఎస్ తన గుప్పిట్లో ఉంచుకుందని ఆరోపించారు. ఇప్పటికే

-మిగతా 2 లో..

## తెలంగాణలో చలి పంజా..

### గణనీయంగా పెరిగిన చలి తీవ్రత సాధారణంకంటే కనిష్ట ఉషో?గ్రతలు నమోదు

తెలంగాణలో చలి తీవ్రత గణనీయంగా పెరిగింది. కనిష్ట ఉషో?గ్రతలు సాధారణం కంటే 3-4 డిగ్రీలు తగ్గాయి. రానున్న నాలుగు రోజులు చలి మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో అత్యల్పంగా 7.2 డిగ్రీల ఉషో?గ్రత నమోదైంది.దాదాపు అన్ని జిల్లాల్లో కనిష' ఉషో?గ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల మేర తగ్గాయి.



హైదరాబాద్,డిసెంబర్9: ముఖ్యంగా సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో రహదారులపై దృశ్యత తగ్గి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్మల్ జిల్లా పెంబి మండలం చింతగూడకు చెందిన 60 ఏళ్ల వృద్ధుడు గంగారెడ్డి చలి తీవ్రతకు బలవ్వడం ఈ పరిస్థితి తీవ్రతకు

-మిగతా 2 లో..



# భారత్‌లో 1.5 లక్షల కోట్లు పెట్టుబడి

న్యూఢిల్లీ, డిసెంబర్ 9 : భారతదేశం ఎఐ అవకాశంపై స్ఫూర్తిదాయకమైన సంభాషణలకు సత్యానాదెళ్ల ప్రధాని నరేంద్రమోడీకి థాంక్స్ చెప్పారు. ఆసియాలోనే మైక్రోసాఫ్ట్ అతిపెద్ద పెట్టుబడి లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. మోడీతో మీటింగ్ గురించి నాదెళ్ల ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'భారతదేశ ఏఐ అవకాశంపై స్ఫూర్తిదాయకమైన సంభాషణలకు ప్రధాని నరేంద్రమోడీకి ధన్యవాదాలు, దేశ ఆశయాలకు మద్దతు ఇవ్వడానికి, ఇండియా ఏఐ ఫస్ట్ ఫ్యూచర్‌కు అవసరమైన మౌలికసదుపాయాలు, నైపుణ్యాలు, సామర్థ్యాలను నిర్మించడంలో సహాయపడటానికి జాశ్రీ17.5 బిలియన్ల పెట్టుబడి నిబద్ధతకు కట్టుబడి ఉన్నామని అన్నారు.గూగుల్, అమెజాన్ కూడా భారత్‌లో డేటా సెంటర్లు, ఏఐ హబ్‌ల ఏర్పాటులో బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించాయి. అక్టోబర్‌లో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ఏపీలోని విశాఖపట్నంలో ఏఐ హబ్ కోసం 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికను వెల్లడించారు. ప్రముఖ టెక్నాలజీ సంస్థ మైక్రోసాఫ్ట్ భారత్‌లో భారీ పెట్టుబడి పెట్టనుంది. భారత్ తన ఏఐ లక్ష్యాలను చేరుకోవడానికి 17.5 బిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టనున్నట్లు కంపెనీ సీఈఓ సత్య నాదెళ్ల ప్రకటించారు. ప్రధాని నరేంద్రమోదీతో మంగళవారం భేటీ అయిన ఆయన.. ఈ పెట్టుబడి గురించి ఎక్స్ వేదికగా ప్రకటన చేశారు. భారత్‌లో ఏఐ అవకాశాలపై స్ఫూర్తిదాయక సంభాషణ తమ మధ్య జరిగిందని పేర్కొంటూ ప్రధాని మోదీతో ఉన్న చిత్రాన్ని పోస్ట్ చేశారు. దేశ ఏఐ ఆశయాలకు మద్దతుగా పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టనున్నట్లు సత్యానాదెళ్ల ప్రకటించారు.

# ఇండిగోకు కేంద్రం గట్టి షాక్

(మొదటిపేజీ తరువాయి)

వైఫల్యం, విమాన షెడ్యూళ్లు, కమ్యూనికేషన్ సరిగా లేకపోవడం వల్ల చాలా మంది ప్రయాణికులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొన్నారని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని, అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఈలోగా సంస్థ కార్యకలాపాలను సమీక్షించేందుకు మ-రోసారి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించినట్లు నాయుడు తెలిపారు. డిసెంబర్ 6 వరకు ప్రభావితమైన విమానాలకు టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు నూరు శాతం రిఫండ్లు పూర్తి చేసినట్లు ఇండిగో సీఈఓ మంత్రికి వివరించగా.. మిగిలిన మొత్తాలను కూడా త్వరగా వాపస్ చేయాలని ఆదేశించారు. ఇండిగో సేవల్లో ఈ పరిస్థితి తలెత్తకుండా అన్ని మార్గాల్లో విమాన సర్వీసులను తగ్గించాలని నిర్ణయానికొచ్చినట్లు మంత్రి తెలిపారు. మునుపటిలానే అన్ని గమ్యస్థానాలను కవర్ చేయాలని విమానయాన సంస్థను ఆదేశించారు. ఛార్జీలపై పరిమితి, ప్రయాణికుల సౌకర్యానికి సంబంధించి మంత్రిత్వశాఖ ఇచ్చిన అన్ని ఆదేశాలను పాటించాలని ఆదేశించారు.ఇదిలావుంటే ఇండిగో సంస్థ తాజా పరిస్థితుల నుంచి బయటపడి సాధారణ స్థితికి చేరుకుందని ఆ సంస్థ సీఈఓ పీటర్ ఎల్బర్స్ తెలిపారు. ఇండిగో సంస్థలో తలెత్తిన ఇబ్బందుల వల్ల.. అత్యవసర పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే వేల మంది ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఈ విషయమై క్షమాపణలు కోరారు సీఈఓ. ఇండిగో విమాన సర్వీసుల్లోఇకపై ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకుంటామని పీటర్ హామీ ఇచ్చారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఇండిగో విమానయాన సిబ్బంది అంతా తీవ్రంగా శ్రమిస్తున్నారని ఆయన చెప్పారు. ప్రయాణికులే తమ తొలి ప్రాధాన్యమని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గత కొన్ని రోజులుగా విమాన సర్వీసులు రద్దవడంతో.. ఇప్పటికే లక్షలాది మంది ప్రయాణికులకు రీఫండ్ చెల్లింపు పక్రియ పూర్తి చేశామని సీఈఓ పేర్కొన్నారు. అలాగే సదరు ప్రయాణికులకు చెందిన లగేజీ సైతం వారి నివాసాలకు చేరవేశామని తెలిపారు. మిగిలిన మరికొన్ని బ్యాగేజీలనూ త్వరలోనే ఆయా ఇళ్లకు చేరుస్తామని, దీనికోసం తగిన ఏర్పాట్లు చేశామని ప్రకటించారు. తీవ్ర ఇబ్బందుల నడుమ.. డిసెంబర్ 5న 700గ ÷÷-లట్లైను మాత్రమే నడపగలిగామని సీఈఓ వెల్లడించారు. అయితే.. సోమ, మంగళవారాల్లో పరిస్థితులు కాస్త మెరుగవ్వడంతో మొత్తం 1800 విమానాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రస్తుతం.. 138 గమ్య స్థానాలకు ఇండిగో ప్రయాణాలు కొనసాగుతు న్నాయన్న ఆయన.. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం(అ।నిబిసజీ ఉనీలబి)తో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. కేంద్రంతో పూర్తి సహకారంతో ముందడగు వేస్తున్నట్టు తెలిపారు.

# తెలంగాణ టెన్త్ పరీక్షల షెడ్యూల్ విడుదల

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. మార్చి 14న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకెండ్ లాంగ్వేజ్, 23న ఇంగ్లీష్, 28న గణితం, ఏప్రిల్ 2న ఫిజిక్స్, ఏప్రిల్ 7న బయాలజీ, ఏప్రిల్ 13న సోషల్ స్టీడీస్ పరీక్షలు జరగనున్నాయి. ఏప్రిల్ 15న ఒకేషనల్ కోర్సు పేపర్-1 భాషా పీరీక్ష, ఏప్రిల్ 16న ఒకేషనల్ కోర్సు పేపర్-2 భాషా పరీక్ష జరగనుంది. ఈ షెడ్యూల్ ప్రకారం ప్రతి పరీక్షకు మధ్య మూడు రోజుల గ్యాప్‌ను కల్పించారు. దీని ద్వారా విద్యార్థులు ఒక పరీక్ష నుంచి మరో పరీక్షకు సమగ్రంగా సిద్ధమయ్యే అవకాశం ఉంటుందని బోర్డు పేర్కొంది. గతంలో ఒకటి లేదా రెండు రోజుల గ్యాప్‌తో పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ఆ పరిస్థితిని దృష్టిలో ఉంచుకునే ఈసారి గ్యాప్‌ను పెంచామని అధికారులు వెల్లడించారు. మార్చి 14న మొదటి భాష పరీక్షతో ఎస్ఎస్‌సీ పరీక్షలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత రెండో భాష, మూడో భాష (ఆంగ్లం), గణితం, సైన్స్ (ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్), సామాజిక శాస్త్రం పరీక్షలు వరుసగా నిర్వహిస్తారు. ఏప్రిల్ 13న చివరిగా సోషల్ స్టడీస్ పరీక్షతో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగియనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎక్కువ భాగం పరీక్షలు జరుగుతాయని బోర్డు స్పష్టం చేసింది. సైన్స్ అంశాలకు సంబంధించిన పరీక్షలకు నిర్ణీత సమయం కొద్దిగా భిన్నంగా ఉంటుందని అధికారులు తెలియజేశారు. వృత్తి విద్య (వొకేషనల్) విద్యార్థులు, ఓపెన్ స్కూల్ విద్యార్థులకు కూడా ఇదే షెడ్యూల్ వర్తిస్తుందని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని బోర్డు అధికారులు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రశ్న పత్రాల గోప్యతకు ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అలాగే హాల్‌టికెట్ల పంపిణీ, పరీక్ష కేంద్రాల కేటాయింపును ముందుగానే పూర్తి చేస్తామని తెలిపారు. విద్యార్థులు పరీక్షల టైమ్‌టేబుల్‌ను గమనించి, ప్రణాళికబద్ధంగా చదువు కొనసాగించాలని అధికారులు సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడమే లక్ష్యంగా ఈ షెడ్యూల్‌ను రూపొందించినట్లు బోర్డు స్పష్టం చేసింది.

# రెండో రోజు పెట్టుబడుల వెల్లువ

**హైదరాబాద్, డిసెంబర్9 :** ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్, డేటా సెంటర్లు, ఔషధ రంగం, క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్ వంటి విభాగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగాలు రానున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఇన్‌ఫ్రాకీడిసి పార్క్‌ 150 ఎకరాల్లో 1గిగావాట్ సామర్థ్యం గల భారీ డేటా పార్క్ అభివృద్ధి చేపట్టిందుకు రూ. 70 వేల కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చింది. జెసీకేఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ రూ.9 వేల కోట్ల పెట్టుబడితో పెద్ద స్థాయి డేటా సెంటర్ల నిర్మాణం చేపడుతోంది. దీంతో సుమారు 2 వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ఏజీపీ గ్రూప్ మొత్తం రూ.6,750 కోట్ల పెట్టుబడితో 1గిగావాట్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. బయోలాజికల్ ఈ లిమిటెడ్ (బీఈ) టీకాలు, పరిశోధన-అభివృద్ధి, తయారీ సేవల విస్తరణలో భాగంగా రూ.3,500 కోట్ల కొత్త పెట్టుబడి ప్రకటించింది. గత పెట్టుబడితో కలిపి మొత్తం రూ.4 వేల కోట్లు అవుతుంది. 3 వేలకు పైగా ఉద్యోగాలు రాబోతున్నాయి. ఫెర్టిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.2 వేల కోట్ల పెట్టుబడితో తెలంగాణలో అధునాతన ఆహారం?వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయనుంది. దీంతో 800 పైగా ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. స్థిర వ్యవసాయానికి అవసరమైన పోషకాలు, బయో ఉత్ప్రేరకాలు తయారీకి రూ.200 కోట్ల పెట్టుబడి ప్రతిపాదించారు. వింటేజ్ కాఫీ అండ్ బెవరేజెస్ లిమిటెడ్ ఫ్రీజ్?డ్రైడ్ కాఫీ స్థాపనకు రూ.1,100 కోట్ల పెట్టుబడితో యూనిట్ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా వెయ్యి మంది వరకు ఉద్యోగావకాశాలు లబించనున్నాయి. రిలయన్స్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ రూ.1,500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయబోయే యూనిట్ ద్వారా వెయ్యి మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఎలక్ట్రానిక్ తయారీ సేవల విస్తరణలో కేన్స్ టెక్నాలజీ ఇండియా లిమిటెడ్ రూ.1,000 కోట్లకు పైగా పెట్టుబడి ప్రతిపాదించింది.ఆర్సీటీ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మూడు విడతల్లో రూ.2,500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీంతో 1,600 కి పైగా ఉద్యోగాలు లభించనున్నాయి. పర్వ్యా గ్రూప్ 50 మెగావాట్ల సామర్థ్యం గల గ్లోబల్ కెపాసిటీ, ఏఐ ఆధారిత డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. దీని ద్వారా 3 వేల మందికి ఉపాధి వచ్చే అవకాశం ఉంది.అరబిందో ఫార్మా రూ.2 వేల కోట్లతో విస్తరణ చేపట్టి 3వేలకి పైగా ఉద్యోగాలు సృష్టించనున్నారు.హెటెరో సంస్థ మందుల తయారీ యూనిట్ల విస్తరణకు రూ.1,800 కోట్ల పెట్టుబడి ప్రకటించింది. దీంతో 9వేలకి పైగా ప్రత్యక్ష?పరోక్ష ఉద్యోగాలు సృష్టించనున్నారు.గ్రాన్యూల్స్ ఇండియా రూ.1,200 కోట్ల పెట్టుబడితో 2,500?3 వేల మందికి ఉపాధి కల్పించనుంది. భారత్ బయోటెక్ రూ.1,000 కోట్ల పెట్టుబడితో పరిశోధన, అభివృద్ధి, తయారీ సేవల కోసం ఆధునిక కేంద్రం ఏర్పాటు చేస్తోంది. దీంతో 200లకు పైగా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ఆహార పానీయాల తయారీ విస్తరణలో కేజేఎస్ ఇండియా రూ.650 కోట్ల పెట్టుబడికి



ముందుకొచ్చింది. ఈ యూనిట్ ద్వారా 1,551 మందికి ఉపాధి దొరకనుంది. గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ రాష్ట్రంలో పాల ఉత్పత్తి విస్తరణకు రూ.150 కోట్ల పెట్టుబడితో 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ యూనిట్ ద్వారా 300 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఆక్వెలాన్నెక్సస్ లిమిటెడ్ తెలంగాణలో క్లీన్ ఎనర్జీ ఆధారంగా 50 మెగావాట్ల నెట్ జీరో ఉద్గారాల డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. పర్యాటక రంగంలో రూ.7,045 కోట్ల భారీ పెట్టుబడులు రానున్నాయి ప్రత్యక్షంగా 10 వేల మందికి,పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి లభించనుంది. ఫుడ్ లింక్ ఎఫ్అండ్‌బీ హోల్డింగ్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ? రూ.3,000 కోట్లు పెట్టుబడులతో ముందుకొచ్చింది. డ్రీమ్‌వాలీ గోల్ఫ్ అండ్ రిసార్ట్స్ ? రూ.1,000 కోట్లతో నిర్మించనున్నారు. సారస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1,000 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. అట్మాస్ఫియర్ కోర్ హోటల్స్ (మాల్దీవులు) రూ.800 కోట్లు, కేఈఐ గ్రూప్ (కామినేని గ్రూప్) ? రూ.200 కోట్లు, పోలిన్ గ్రూప్ (టర్కీ), మల్టీవర్స్ హోటల్స్ రూ.300 కోట్లు, ఫ్లుద్రా ఇండియా (స్పెయిన్) ? రూ.300 కోట్లు, శ్రీ హవిషా హాస్పిటాలిటీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ? రూ.300 కోట్లు, రిధిరా గ్రూప్ ? రూ.120 కోట్లు, సలామ్ నమస్తే దోసా హట్ (ఆస్ట్రేలియా), విశాఖ రిక్రియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ? రూ.25 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిల్మ్ అండ్ యానిమేషన్ ఐఫా ఉత్సవం, ఏథెన్స్ ఈవెంట్ల భాగస్వామ్యం ద్వారా రాష్ట్రానికి రూ.550?600 కోట్ల ఆర్థిక లాభం చేకూరనుంది. టిడబ్ల్యూఐ గ్రూప్ ప్రపంచంలోనే తొలి ప్లగ్-ఇన్ హైబ్రిడ్ మోటార్‌బైక్ తయారీ కేంద్రం తెలంగాణలో ఏర్పాటు. రూ.1,100 కోట్లు పెట్టుబడితో 500 మందికి ఉద్యోగాల కల్పన అవకాశాలు రానున్నాయి. మహీంద్రా అండ్ మహీంద్ర జహీరాబాద్ యూనిట్ విస్తరణకు నాలుగేళ్లలో రూ.500 కోట్లకు పైగా పెట్టుబడికి ముందుకొచ్చింది. ఇండియా ఎక్స్ ట్రీమ్ అడ్వెంచర్20 ఎకరాల్లో ఎక్స్ ట్రీమ్ స్పోర్ట్స్, అడ్వెంచర్, ఈ-స్పోర్ట్స్ అరేనా. మొత్తంగా రూ.500 కోట్లు పెట్టుబడి పెట్టింది. బయోవరంటిష్యూ ఇంజినీరింగ్, రెజెనరేటివ్ మెడిసిన్, సెల్?జీన్ థెరపీకి ప్రత్యేక కేంద్రం రూ. 250 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. జ్యూరిక్ ఇన్సూరెన్స్ ఇండియాలో తొలి గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (ఉఅఅ) కోసం హైదరాబాద్‌ను ఎంపిక చేసుకుంది. మూడేండ్లలో దశలవారీగా విస్తరించనున్నారు. కెనడియన్ ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ తమ తొలి భారతీయ సంస్థను హైదరాబాద్‌లో స్థాపించ నున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌ను గ్లోబల్ ఇంజినీరింగ్ సైబర్ హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పేర్కొంది. మాక్సిమస్ (అమెరికా) గ్లోబల్ పబ్లిక్ సెక్టార్ టెక్నాలజీ?ఆపరేషన్స్ హబ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నారు. జీఎంఆర్ స్పోర్ట్స్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ లో భాగంగా శాటిలైట్ స్పోర్ట్స్ సిటీ అభివృద్ధి చేయనున్నారు. అనలాగ్ ఏఐ (అలెక్స్ కిప్‌మాన్) హైదరాబాద్‌లో గ్లోబల్ పరిశోధన?ప్రోటోటైపింగ్ ల్యాబ్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఆల్ట్ మిన్ బ్యాటరీ ముడి పదార్థాల తయారీ కేంద్రం ప్రతిపాదించారు. అజయ్ దేవగన్ ఫిల్మ్ స్టూడియోలో స్టూడియోలు, వీఎఫ్ ఎక్స్, వర్క్ షాప్‌లు వంటి ఫిల్మ్ ఎకోసిస్టమ్‌నుపీపీపీ మోడల్‌లో అభివృద్ధి చేయనున్నారు. దీంతో యువతకు ఉపాధి అవకావాలు పెరగనున్నాయి. తెలంగాణ,యూఏఈ,ఆఫ్రికా పెట్టుబడి భాగస్వామ్యాల కోసం చర్చించారు. బహుళరంగ పెట్టుబడి డెస్క్ ఏర్పాటుకు ఎంఓయూ చేసుకునేందుకు పరిశీలించారు. బ్లాక్‌స్టోన్ ఆసియా డేటా సెంటర్లు, లాజిస్టిక్స్ పార్కులు, కమర్షియల్ స్పేస్‌లలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపారు. సత్వ గ్రూప్ సమగ్ర పట్టణ అభివృద్ధి, స్టూడెంట్?సీనియర్ లివింగ్ ప్రాజెక్టులపై చర్చించారు.బ్రిగేడ్ గ్రూప్ సమగ్ర టౌన్‌షిప్ ప్రతిపాదనపై చర్చ. 18 దేశాలు పాల్గొనే ఏషియారోయింగ్ ఛాంపియన్‌షిప్ 2026 నిర్వహించనున్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్ 2026 ప్రపంచంలోనే అతిపెద్ద చెస్ ఉత్సవం కానుంది.

# తెలంగాణ మట్టిలోనే గొప్ప చైతన్యం

రెడ్డి స్పష్టం చేశారు. పేదల్లో నిరుపేదలకు సహాయం చేయడానికే తాము ప్రాధాన్యం ఇస్తామన్నారు. సమాజంలో వివక్షత నిర్మూలన తమ లక్ష్యమని తెలిపారు. మంగళవారం ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో సీఎం రేవంత్ ప్రసంగించారు. విజన్ డాక్యుమెంట్-2047 రూపకల్పనలో అందరి భాగస్వామ్యం ఉందన్నారు. నీతి ఆయోగ్, ఐఎస్‌బీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ప్రజలు భాగమయ్యా రన్నారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకే.. తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047 రూపొందించామని చెప్పారు.విద్య కోసం ఖర్చు చేసేది వ్యయం కాదని పెట్టబడి అని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యలో నాణ్యతతోపాటు నైపుణ్యాన్ని అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనిక పత్రం, రాబోయే రెండు దశాబ్దాల్లో రాష్ట్రాన్ని సమగ్రంగా, సమ్మిళితంగా సుస్థిరంగా అభివృద్ధి చేసే దిశగా భవిష్యత్తు కు బాటలు వేసే దార్శనిక పత్రం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ అని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను ఆవిష్కరించే బృహత్తరమైన ప్రయత్నంలో భాగమే తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ రూపొందించామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉజ్జ్వల భవిత కోసం..ప్రజల భవిష్యత్తు కోసం.. భావి తరాల కోసం.. ముందుచూపుతో 'తెలంగాణ రైజింగ్ 2047' డాక్యుమెంట్ రూపుదిద్దుకుందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ఈ డాక్యుమెంట్ తయారు చేసింది. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల అభిప్రాయాలు.. ఆకాంక్షలకు ఇందులో చోటు కల్పించింది. అన్ని శాఖల మంత్రులు, అన్ని విభాగాల అధికారులు, మేధావులు, అన్ని రంగాల నిపుణులు, పారిశ్రామికవేత్తలు, సామాజిక, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సలహాలకు ప్రాధాన్యమిచ్చింది. ఈ డాక్యుమెంట్ తయారీలో నీతి ఆయోగ్ కీలక భూమిక నిర్వహించింది. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్లు డాక్యుమెంట్ తయారీలో పాలుపంచుకున్నారు. వరుస సంప్రదింపులు, రోజుల తరబడి చర్చలు, ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ప్రముఖుల సలహాలు, సూచనలు, వివిధ దేశాలు అనుసరిస్తున్న ఆదర్శవంతమైన విధానాలన్నింటినీ ప్రభుత్వం అధ్యయనం చేసింది. వీటన్నింటినీ విశ్లేషించుకొని.. వడపోసి.. తెలంగాణ భవిష్యత్తు ఎలా ఉండాలో ఈ దార్శనిక పత్రంలో పొందుపరిచింది. ఇందులో ఉన్న ప్రతి అధ్యాయం తెలంగాణ పురోగాభివృద్ధికి దోహదపడుతుంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా వృద్ధి చేయడం తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ విజన్ ప్రధాన లక్ష్యం. దీంతో తెలంగాణ అభివృద్ధిలో ప్రపంచ దేశాలకు ధీటుగా నిలబడి.. దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఒకటిగా నిలుస్తుంది.రాష్టం నలుమూలల అన్ని జిల్లాల నుంచి దాదాపు 4 లక్షల మంది ఆకాంక్షలు.. అభిప్రాయాలతో ఈ డాక్యుమెంట్ రూపొందించారు. 65 శాతం యువత ఈ ఉజ్వల తెలంగాణ భవిష్యత్ రూపకల్పన లో పాలుపంచుకున్నారు.అదునాతన సాంకేతికత, కొత్త ఆవిష్కరణలు, సమ-ర్థవంతమైన ఆర్థిక వనరులతో పాటు సుపరిపాలన ఈ ఆర్థిక వృద్ధికి ఉత్ప్రేరకంగా పని చేస్తాయి. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి మూడు-జోన్ల అభివృద్ధి నమూనాను ఈ డాక్యుమెంట్ కీలకంగా ప్రస్తావించింది. హైదరాబాద్ సిటీ తో పాటు పరిసర ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల మధ్య సమతుల్య, పరస్పర ఆధారిత వృద్ధిని సాధించే సంకల్పం. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలనే మైలు రాయి ని నిర్దేశిరచింది. 2047 నాటికి జాతీయ జీఎస్‌డిపిలో తెలంగాణ వాటా పదో వంతు కు చేరాలని లక్ష్యంగా ఎంచుకుంది.పెట్టుబడులకు గమ్యస్థానంగా, ఆవిష్కరణలకు కేంద్రంగా తెలంగాణను ప్రపంచ స్థాయి మౌలిక వసతులున్న అత్యాధునిక రాష్ట్రంగా తీర్చిదిద్దటం. అన్ని వర్గాలకు సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పించే ఆదర్శవంతమైన రాష్ట్రంగా నిలబెట్టడం లక్ష్యంగా ఈ డాక్యుమెంట్ రూపొందింది.



# తెలంగాణలో చలి పంజా..

(మొదటిపేజీ తరువాయి)

అద్దం పడుతోంది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రానున్న రోజుల్లో చలి ప్రభావం మరింత ఎక్కువ అవుతుందని చెప్పారు. ముఖ్యంగా వచ్చే నాలుగు రోజులు (డిసెంబర్ 10, 11, 12, 13) చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలోనే అత్యల్ప కనిష' ఉషో?గ్రత సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 7.2 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి ప్రభావం అధికంగా ఉన్నప్పటికీ, దక్షిణ తెలంగాణలోని కొన్ని జిల్లాల్లోనూ చలిగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈనెల 16 వరకు చలిగాలుల ప్రభావం తీవ్రంగా ఉంటుందని అంచనా వేశారు. ముఖ్యంగా జగిత్యాల, సంగారెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, వికారాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిద్ధిపేట, రంగారెడ్డి ఉన్నాయి.ముఖ్యంగా రాజధాని హైదరాబాద్ నగరంలోనూ చలి తీవ్రత పెరగనుందని, ఇక్కడ కనిష్ట ఉషో?గ్రతలు 9 డిగ్రీల సెల్సియస్ నుంచి 12 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతాయని అంచనా వేస్తున్నారు. వ ృద్ధులు, పిల్లలు తప్పనిసరిగా వెచ్చటి దుస్తులు ధరించాలని, అత్యవసరమైతే తప్ప ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు రాకుండా ఉండాలని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ప్రజలు చలి నుంచి రక్షణ కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వెచ్చటి దుస్తులు ధరించాలని, వేడి వేడి భోజనం చేయాలని తెలిపారు.

# భారీగా ఉద్యోగాల కల్పనే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో నిర్వహించిన సెషన్‌లో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు నాలుగో న్యూక్లియస్ (కేంద్రం)గా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామన్నారు. 13,500 ఎకరాల్లో గ్రీన్ సిటీగా అభివృద్ధి చేస్తాం. ఫ్యూచర్ సిటీని మెట్రో రైలుతో అనుసంధానిస్తాం. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు అనుగుణంగా తీర్చిదిద్దుతాం అన్నారు. జోన్లవారీగా విభజించి ప్రతి జోన్‌ను విభిన్నంగా తీర్చిదిద్దుతాం. ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎంటర్‌టైన్‌మెంట్ డిస్టిక్ట్, స్పోర్ట్స్ హబ్, ఎడ్యుకేషన్ జోన్, ఎకో టూరిజం హబ్ ఉంటాయి. ఫ్యూచర్ సిటీలో వర్సిటీల ఏర్పాటుకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. త్వరలోనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రారంభిస్తాం. జూపార్క్ ఏర్పాటుకు వంతారాతో ఇప్పటికే ఒప్పందం జరిగింది. 400 ఎకరాల్లో డేటా సెంటర్ సిటీ నిర్మాణం జరుగుతుందని శ్రీధర్‌బాబు వివరించారు. దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే ప్రపంచ స్థాయి నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నట్టు శ్రీధర్ బాబు వెల్లడించారు. అద్భుతమైన మౌలిక వసతులతో ఏర్పాటయ్యే ఈ నగరాన్ని 13,500 ఎకరాలలలో జీరో కార్బన్ సిటీగా రూపొందించనున్నట్టు తెలిపారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ, యాజ్ ఏ మ్యాగ్నెట్ ఫర్ 3 ట్రిలియన్ డాలర్స్ తెలంగాణా' అనే అంశంపై ప్రభుత్వ ప్రణాళికలను మంగవారం నాడు ఆయన గ్లోబల్ సమ్మిట్ లో వివరించారు. భవిష్యత్ నగరాన్నిఆరు అర్బన్ జిల్లాలుగా అభివృద్ధి చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఇక్కడ ఏర్పాటయ్యే



వివిధ పరిశోధన సంస్థలు, గ్రీన్ ఫార్మా, మ్యాన్యుఫాక్చరింగ్, ఎంటర్ టెయిన్ మెంట్ జోన్ల ద్వారా మొత్తం 13 లక్షల మందికి ఉద్యోగాలు దొరుకుతాయి. 9 లక్షల జనాభా కోసం నివాస గృహాల సముదాయాలు ఏర్పాటు చేస్తాం. నిర్మాణరంగంలో ఉన్నవారు వీటిని అభివృద్ధి చేస్తారు. మరో నెల రోజుల్లో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. డేటా సెంటర్ల కోసం 400 ఎకరాలు కేటాయిస్తున్నాం. వచ్చే ఫిబ్రవరి చివరలో ఇక్కడ నిర్మాణాలు మొదలవుతాయి.ఎంటర్ టెయిన్ మెంట్ జోన్ (డిస్టిక్ట్ ) లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కన్ వెన్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. అడ్వెంచర్ కేంద్రాలు, స్టార్ హోటళ్లు నిర్మిస్తాం అన్నారు.

# రాజ్యాంగాన్ని గుప్పిట్లో పెట్టుకునే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

దేశంలోని విద్యావ్యవస్థను మార్చేశారని, దేశంలోని వైవిధ్యాన్ని నాశనం చేస్తున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్ వ్యతిరేకులను ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకే ఈసీని వాడుకుంటున్నారని, క్షేత్ర స్థాయిలో ఎన్నికల సంస్కరణలు అమలు కావడం లేదని రాహుల్ ఆరోపించారు. ఈసీ నియామకంలో మోదీ, అమిత్‌షాకు ఎందుకంత ఆసక్తి అని ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్లకు మోదీ, అమిత్‌షా బహుమతులిస్తున్నారని, సీబీఐ, ఈడీలను ప్రభుత్వం తన గుప్పిట్లో ఉంచుకుందని ఆరోపణలు గుప్పించారు. కేంద్రం, ఎన్నికల సంఘం కుమ్మకయ్యాయని, తాను నిజాలు మాట్లాడుతుంటే బీజేపీ జీర్ణించుకోలేక పోతోందని అన్నారు. తాను ఏదీ తప్పుగా మాట్లాడలేదని, పూర్తి ఆధారాలతోనే మాట్లాడుతున్నానని చెప్పారు. ఎన్నికల సంస్కరణలపై కేంద్రం గొప్పలు చెప్పుకుంటోందని రాహుల్ విమర్శించారు. ఉత్తరప్రదేశ్, హరియాణాలో పలు చోట్ల 'ఓట్ చోరీ' జరిగిందన్నారు. ఎన్నికల సీసీ ఫుటేజ్‌ను ధ్వంసం చేశారని, ఫేక్ ఓట్లపై ఈసీ క్లారిటీ ఇవ్వలేదని చెప్పారు. తాను అడిగిన ప్రశ్నలకు ఇప్పటికీ ఈసీ సమాధానం ఇవ్వలేదని అన్నారు.

# గ్లోబల్ సమ్మిట్ విజయవంతం

- రెండ్రోజులు పాటు అట్టహాసంగా సాగిన సదస్సు
- తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ విడుదల
- సింఎం రేంవత్‌పై ఆనంద్ మహీంద్ర ప్రశంసలు
- విజన్ అద్భుతంగా ఉందన్న మాజీ ఆర్‌బిఐ గవర్నర్ దువ్వూరి



**హైదరాబాద్, డిసెంబర్ 9 :** భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత వైభవంగా నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' విజయవంతంగా ముగిసింది. రెండురోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా దీనిని నిర్వహించారు. ఈ అంతర్జాతీయ స్థాయి సమ్మిట్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్రా అండ్ మహీంద్రా చైర్‌పర్సన్ ఆనంద్ మహీంద్రా పాల్గొని సీఎం రేవంత్ రెడ్డిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన అభివృద్ధి దిశ, విజన్ డాక్యుమెంట్ ఆయనను బాగా ఆకట్టుకుందని వెల్లడించారు. సమ్మిట్ వేదికపై మాట్లాడిన ఆనంద్ మహీంద్రా టెక్నాలజీ ఎంత వేగంగా ఎదిగినా, డిజిటలైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంత విస్తరించినా హ్యూమన్ టచ్‌కు ఉన్న ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదన్నారు. మానవీయ నైపుణ్యాన్ని ఏ సాంకేతికత భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా హ్యూమన్ స్కిల్స్‌కు కీలక పాత్ర ఉంటుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన విజన్ డాక్యుమెంట్‌ను పరిశీలించిన తర్వాత లక్ష్యాలను మరింత విస్తృతంగా, పెద్ద స్థాయిలో పెట్టుకోవాలని అనిపించిందని ఆనంద్ మహీంద్రా తెలిపారు. ఆ డాక్యుమెంట్‌ను చూస్తే నిపుణుల అభిప్రాయాలు మాత్రమే కాకుండా, తెలంగాణ ప్రజల ఆశయాలు కూడా ప్రతిబింబించినట్లు అనిపించిందన్నారు. యువత, మహిళలు, సమగ్ర అభివృద్ధి వంటి అంశాలు సమతుల్యంగా ఇందులో పొందుపరిచినట్లు ప్రశంసించారు. ఇంత స్ఫూర్తి దాయకమైన విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆనంద్ మహీంద్రా ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం స్పష్టమైన దిశ, ధైర్యమైన లక్ష్యాలతో ముందుకు వెళ్తున్న నాయకత్వం తెలంగాణలో కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. జహీరాబాద్‌లో మహిళలు నిర్వహిస్తున్న బ్యాటరీ తయారీ పరిశ్రమ తమకు గర్వకారణమని ఆనంద్ మహీంద్రా చెప్పారు. మహిళా సాధికారత, పారిశ్రామిక అభివృద్ధి రెండూ కలిసొచ్చేలా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. నాలుగు దశాబ్దాలుగా వ్యాపార రంగంలో ఉన్న తన అనుభవంతో చూస్తే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు ఒక సమఉజ్జీలా కనిపిస్తున్నారని ఆనంద్ మహీంద్రా వ్యాఖ్యానించారు. భవిష్యత్తు తెలంగాణ నిర్మాణంలో ఈ తరహా నాయకత్వం కీలకంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో అన్ని సెషన్లు ముగిశాయి. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ విజన్-2047' డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా, అగ్రనటుడు చిరంజీవి, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ.. దీర్ఘకాలిక లక్ష్యాలతో డాక్యుమెంట్‌ను రూపొందించారని కితాబిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి దార్శనికతకు అభినందనలు తెలిపారు. 'స్కిల్ యూనివర్సిటీకి ఛైర్మన్‌గా ఉండాలని మొదట సీఎం నన్ను అడిగారు. అప్పటికే టెక్ మహీంద్రా యూనివర్సిటీకి ఛైర్మన్‌గా ఉన్నందున వద్దని చెప్పాను. అయితే, ఆయన లక్ష్యాలు, విజన్ విన్నాక తిరస్కరించలేకపోయాను. తెలంగాణ రైజింగ్ విజన్ బ్లూప్రింట్ చూశాను. ప్రజలు కేంద్రంగా దీన్ని రూపొందించారని అన్నారు. తెలంగాణ గొప్ప అభివృద్ధి సాధిస్తోందని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. దేశంలోనే వృద్ధిరేటు ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా నిలిచిందన్నారు. 'హైదరాబాద్ ఐకానిక్ నగరంగా నిలిచింది. ప్రపంచస్థాయి కంపెనీలకు ఇప్పుడు గమ్యస్థానంగా ఉంది. నీతి ఆయోగ్ లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఉంది. దేశంలోనే వృద్ధిరేటు ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఏటా 8-9 శాతం వృద్ధి సాధిస్తే.. తెలంగాణ తన లక్ష్యాలను అందుకోగలదు ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీకి హబ్‌గా హైదరాబాద్ నిలిచింది. భౌతిక మౌలిక వసతులతోపాటు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పెరగాలి. చైనా గ్వాంగ్‌డాంగ్ నమూనాను తెలంగాణ ప్రభుత్వం ఎంచుకుంది. తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్ మాత్రమే కాదు.. అన్ బీటబుల్ అని సుబ్బారావు పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌కు విభిన్న ఆలోచనలతో వచ్చిన అందరికీ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపారు. అందరి సూచనలు, ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామన్నారు. 'తెలంగాణ భవిష్యత్తుకు ఈ డాక్యుమెంట్ ఒక దిక్సూచి. డాక్యుమెంట్ రూపకల్పనలో అన్ని రంగాల మేధావుల సలహాలు తీసుకున్నాం. రాష్ట్రంలో డిజిటల్ ఇన్‌ఫ్రాస్టక్చర్‌కు కూడా ప్రాధాన్యం ఇస్తాం' అని చెప్పారు.



## సినీ పరిశ్రమలకు అండదండలు

- అన్ని రకాల సౌకర్యాల కల్పనకు సిద్ధం
- సినీ ప్రముఖులతో భేటీలో సింఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, డిసెంబర్ 9 :** స్క్రిప్ట్‌తో వస్తే సినిమా పూర్తి చేసుకుని వెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం సినీ పరిశ్రమని ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందని టాలీవుడ్ ప్రముఖలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ వేదికగా జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డితో టాలీవుడ్ చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సినీ ఇండస్ట్రీ అభివృద్ధికి కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలను కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీలో స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా వారికి సీఎం వివరించారు. 24 క్రాఫ్ట్సలో సినిమా ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా స్థానికులకు శిక్షణ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని వారికి సీఎం రేవంత్ సూచించారు. ఫ్యూచర్ సిటీలో స్టూడియోలను ఏర్పాటు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని ఈ సందర్భంగా వారికి సీఎం రేవంత్ వివరించారు. సీఎం రేవంత్‌తో సమావేశమైన వారిలో చిరంజీవి, అజయ్ దేవగన్ అల్లు అరవింద్, సురేష్ బాబు, దిల్ రాజు, నటులు జెనీలియా, అక్కినేని అమలతోపాటు పలువురు టాలీవుడ్, బాలీవుడ్ ప్రముఖులు ఉన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డితోపాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. సోమవారం ప్రారంభమైన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నేటితో అంటే.. మంగళవారంతో ముగియనుంది.

## స్కూళ్లకు 6 రోజుల సెలవు

### ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వం నిర్ణయం

**హైదరాబాద్, డిసెంబర్ 9 :** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల కారణంగా పాఠశాలలకు వరుస సెలవులు లభించనున్నాయి. ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పాఠశాలల్లో ఏర్పాటు చేస్తుండటంతో, ప్రభుత్వం పలు దఫాలుగా సెలవులు ప్రకటించింది. దీంతో ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని విద్యార్థులు, ఉపాధ్యాయులకు సుమారు ఆరు రోజుల పాటు విరామం దొరకనుంది. తొలి విడత పోలింగ్ నిర్వహణ, ఏర్పాట్ల కోసం జనవరి 10, 11 తేదీల్లో పాఠశాలలకు సెలవులు ఇస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఇక రెండో విడత ఎన్నికల పోలింగ్ జనవరి 13, 14 తేదీల్లో జరగనుండగా, ఆ రోజులు రెండో శనివారం, ఆదివారం కావడంతో అవి సాధారణ సెలవులుగా కలిసివచ్చాయి. అనంతరం మూడో విడత పోలింగ్ సందర్భంగా జనవరి 16, 17 తేదీల్లో కూడా పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. పోలింగ్ సామగ్రిని సిద్ధం చేయడం, ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించడం కోసం ఈ నిర?యం తీసుకున్నారు. మరోవైపు, పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతో పాటు కార్మికులకు సైతం వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## వందేమాతర గీతం బెంగాల్‌కే పరిమితమా?

### ప్రియాంక వ్యాఖ్యలపై మండిపడ్డ అమిత్ షా

**న్యూఢిల్లీ, డిసెంబర్ 9 :** పశ్చిమబెంగాల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం వందేమాతరంపై చర్చను చేపట్టిందంటూ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తిప్పికొట్టారు. జాతీయ గేయం బెంగాల్‌కు మాత్రమే పరిమితం కాదన్నారు. జాతీయగేయాన్ని రాజకీయాలతో ముడిపెట్టడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. 'వందేమాతరం' 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాజ్యసభలో మంగళవారంనాడు జరిగిన చర్చలో అమిత్‌షా పాల్గొన్నారు. 'వందేమాతరం' 150 ఏళ్లు పూర్తి చేసుకోవడంపై చర్చ ఎందుకని కొందరు సభ్యులు ప్రశ్నిస్తున్నారని, అయితే కాలంతో సంబంధం లేకుండా దేశప్రజల్లో వందేమాతరం ఎప్పటికీ స్ఫూర్తి నింపుతూనే ఉందని అమిత్‌షా అన్నారు. ఆ గేయానికి గతంలోనూ ఎంతో ఔన్నత్యం ఉందని, 2047లోనూ ఉంటుందని చెప్పారు. వందేమాతర గేయాన్ని ఎందుకు చర్చించాలని ప్రశ్నించే వారు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఎన్నికలకు ముడిపెట్టి వందేమాతరం కీర్తిని తక్కువచేసి చూపాలని కొందరు అనుకుంటున్నారని విమర్శించారు. వందేమాతరం గేయాన్ని రచించిన బంకిం బాబు బెంగాల్‌లో పుట్టడం నిజమని, కానీ వందేమాతరం బెంగాల్‌కో, ఇండియాకో మాత్రమే పరిమితమైంది కాదని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన భారతీయ వీరులు ప్రపంచంలో అజ్ఞాతంగా ఎక్కడ కలిసినా వందేమాతరం అని నినదించేవారని అన్నారు. నేటికీ మన సరిహద్దుల్లో దేశ అంతర్గత భద్రత కోసం ప్రాణత్యాగాలు చేస్తున్న మన బలగాల నోట నిరంతరం వందేమాతరం మారుమోగుతోందని అన్నారు. తరతరాలకు వందేమాతరం స్ఫూర్తినిస్తోందని, వందేమాతర గేయంపై ఉభయసభల్లోనూ చర్చ జరపడం వల్ల భవిష్యత్ తరాలవారు కూడా మన జాతీయ గేయం ప్రాధాన్యత, కీర్తిని తెలుసుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. బుజ్జగింపు రాజకీయాల కోసం వందేమాతర గేయాన్ని కాంగ్రెస్ విడగొట్టి ఉండకపోతే దేశ విభజన జరిగి ఉండేది కాదని అమిత్‌షా విమర్శించారు.

## వర్చువల్‌గా జిల్లా కేంద్రాల్లో తెలంగాణ తల్లి విగ్రహాలు ఆవిష్కరణ

**హైదరాబాద్, డిసెంబర్ 9 :** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ వేదికపై నుంచి జిల్లాల కలెక్టరేట్లలోని తెలంగాణ తల్లి విగ్రహాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ గా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. గ్లోబల్ సమ్మిట్ వేదికగా జిల్లాల్లోని కలెక్టరేట్ల పరిధిలోని తెలంగాణ తల్లి విగ్రహాలను వర్చువల్ గా ఆవిష్కరించుకోవడం సంతోషకరం అన్నారు. ఌాలుగు కోట్ల ప్రజల అకాంక్షలను గుర్తించి యూపీఏ ప్రభుత్వం డిసెంబరు 9న తెలంగాణ ఏర్పాటును ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 9 న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించింది. ఎన్ని అడ్డంకులు, ఆటంకాలు ఎదురైనా సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చారు. సోనియా గాంధీ జన్మదినం డిసెంబరు 9 నే అందుకే ప్రతి ఏడాది డిసెంబర్ 9ని తెలంగాణ తల్లి ఆవిర్భావ దినోత్సవం, సోనియా గాంధీ పుట్టినరోజు జరుపుకోవడం మన అందరికీ సంతోషదాయకం అన్నారు. డిసెంబర్ 9, 2009 న సోనియా గాంధీ నేతృత్వంలో తెలంగాణ ఏర్పాటు పక్రియ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన రోజు ఇదని, ప్రకటన తెలంగాణ ప్రజలకు సంతోషాన్ని ఇచ్చింది.. ఆత్మగౌరవాన్ని నిలబెట్టిందన్నారు. అందుకే ప్రజా ప్రభుత్వంలో ఈ రోజుని తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించుకున్నాం. అందులో భాగంగానే గత ఏడాది సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి పరిపాలనలో ఒక స్ఫూర్తి తీసుకొచ్చాం. వాళ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాలను ఆవిష్కరించుకున్నాం అని సిఎం అన్నారు. 2004 లో కరీంనగర్ గడ్డపై నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని సోనియా గాంధీ మాట ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన సోనియా గాంధీ జన్మదినం డిసెంబర్ 9 తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన సోనియా గాంధీ జన్మదిన ఉత్సవాలను జరుపుకుంటాం అని సిఎం ప్రకటించారు.

## ప్రయాణికుల కేంద్రంగా విమానయాన రంగం

- కొలిక్కి వస్తున్న ఇండిగో కార్యకలాపాలు
- డీజీసీఏ నివేదిక ఆధారంగా ఇండిగోపై చర్యలు
- లోక్‌సభలో మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి



**న్యూఢిల్లీ, డిసెంబర్ 9 :** భారతదేశ విమానయాన రంగాన్ని ప్రయాణీకుల కేంద్రీకృతంగా మార్చడానికి దీర్ఘకాలిక చర్యలు చేపట్టామని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఇండిగో సంక్షోభంపై కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మంగళవారం లోక్‌సభలో కీలక ప్రకటన చేశారు. ఇండిగో కార్యకలాపాలు వేగంగా స్థిరీకరించబడుతున్నాయని తెలిపారు. భద్రత పూర్తిగా అమలులో ఉందని అన్నారు. సంక్షోభానికి ఇండిగో విమానయాన సంస్థే జవాబుదారీగా ఉందని స్పష్టం చేశారు. ఇండిగో సంస్థకు షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చామన్నారు. ఇండిగో సంస్థ ప్రణాళికా వైఫల్యాలు, నిబంధనలను పాటించకపోవడం వల్లే ప్రయాణీకులకు ఇంత ఇబ్బంది కలిగిందని తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని ఇతర విమానయాన సంస్థలు సజావుగా నడుస్తున్నాయని అన్నారు. అన్ని విమానాశ్రయాల్లో సాధారణ పరిస్థితులు ఉన్నాయని, రద్దీ ఇబ్బందులు లేవని చెప్పారు. రీఫండ్, బ్యాగేజ్ ప్రయాణీకులకు అందజేయడం వంటి సహాయక చర్యలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. డీజీసీఏ ఇండిగో సంస్థకు షో-కాజ్ నోటీసులు జారీ చేసి దర్యాప్తు చేపట్టిందని వెల్లడించారు. నివేదిక ఆధారంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. ఇండిగో సంక్షోభం కొనసాగుతోంది. నిత్యం వందకుపైగా విమాన సర్వీసులు రద్దు అవుతూనే ఉన్నాయి. ఈ రోజు (మంగళవారం) కూడా అదే పరిస్థితి ఉంది. ఇప్పటి వరకు 92 విమాన సర్వీసులను ఇండిగో రద్దు చేసింది. దేశంలో ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా, గోవాలకు సంబంధించిన సర్వీసులు రద్దయ్యాయి. ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఊతం

- రెండో రోజు మొత్తం రూ.1,11,395 కోట్ల పెట్టుబడులు
- సిఎం రేవంత్ సమక్షంలో పలు కంపెనీల ఒప్పందాలు

**హైదరాబాద్, డిసెంబర్ 9 :** తెలంగాణ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైజింగ్ గ్లోబల్ సమిట్ రెండో రోజు భారీ పెట్టుబడులు సమకూరాయి. వివిధ కంపెనీలు తమ పెట్టుబడులను ప్రకటించాయి. ఈ మేరకు సిఎం రేవంత్ సమక్షంలో పలు ఒప్పందాలు సాగాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశాలకు చెందిన వివిధ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయి. వివిధ కంపెనీల ప్రతినిధులతో వరుస సమావేశాలతో సీఎం రేవంత్‌రెడ్డి బిజీ బిజీగా ఉన్నారు. ఆయన సమక్షంలో పలు కంపెనీలు ఎంవోయూలు కుదుర్చుకుంటున్నాయి. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డితో గోద్రెజ్ జెర్సీ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ ఫిరోజ్ షా గోద్రెజ్, గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామి సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో తమ సంస్థ విస్తరణపై ఫిరోజ్‌షా గోద్రెజ్ సీఎంతో చర్చించారు. పాలు, ఎఫ్‌ఎంసీజీ, రియల్‌ఎస్టేట్, ఆయిల్‌పామ్ విభాగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆ సంస్థ ఆసక్తి కనబరిచింది. మరోవైపు సుమధుర గ్రూప్, టీసీసీఐ తైవాన్ గ్రూప్ తెలంగాణ ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకున్నాయి. రాష్ట్రం రూ.1000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ సంస్థ ముందుకొచ్చింది. కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీఆర్‌డీఎంవో) నిర్మాణానికి రూ. వెయ్యి కోట్లు పెట్టుబడి పెట్టనుంది. వచ్చే నాలుగేళ్లలో 200 మందికిపైగా ఉద్యోగాలు కల్పించనుంది. ఈ మేరకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్‌డీ సెంటర్ కోసం ఫెర్టిస్ ఇండియాతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. రెండు దశల్లో ఫెర్టిస్ ఇండియా రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. మరోవైపు ఫుడ్ అండ్ బేవరేజెస్ యూనిట్-2 విస్తరణకు కేజేఎస్ ఇండియా ఒప్పందం కుదర్చుకుంది. ఫుడ్ అండ్ ఎఫ్‌ఎంసీజీ తయారీ యూనిట్‌కు ఆర్‌సీపీఎల్, ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ మ్యానుఫాక్చరింగ్ సేవల విస్తరణకు క్రైన్స్ టెక్నాలజీ ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. రూ.9 వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు జేసీకే ఇన్‌ఫ్రా, మూడు దశల్లో రూ.2,500 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఆర్‌సీటీ ఎనర్జీ ఇండియా, 50 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ డేటా సెంటర్‌కు అక్వెలోన్ నెక్సస్, హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుకు ఏజీపీ గ్రూప్ ఒప్పందం కుదుర్చుకున్నాయి. రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ఏఐ-రెడీ డేటా పార్క్ ప్రకటించింది. రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్న అరబిందో ఫార్మా, పెప్టైడ్స్ తయారీ అండ్ ఆంకాలజీ సీడీఎంవో యూనిట్ పెట్టనున్న గ్రాన్యుల్స్ ఇండియా పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించాయి. ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజు.. రాష్ట్రానికి పెట్టుబడుల వరద పారింది.. బ్యాక్‌టు బ్యాక్ మీటింగ్‌లు, వరుసగా మౌ సంతకాలతో రాష్ట్రాన్ని పెట్టుబడుల హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి పలు కంపెనీలతో చర్చలు జరిపారు. రెండో రోజు మొత్తం రూ.1,11,395 కోట్ల పెట్టుబడులు తెలంగాణకు రావడం రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఊతం కానుంది. ఈ పెట్టుబడులతో కొత్త సంస్థలు.. భారీ స్థాయిలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా రాబోతున్నాయి.. అయితే, పెట్టుబడుల సంఖ్య మరింత పెరగనుంది..



## ఆసియాకు ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా తెలంగాణ

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, డిసెంబర్ 9 :** దేశ ఎకానమీ చరిత్రలో లేని అత్యంత భారీ లక్ష్యాన్ని 2047 కోసం నిర్దేశించుకున్నామని, తెలంగాణను ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉన్నట్లు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో భాగంగా రెండో రోజు 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం కోసం మూలధనం, ఉత్పాదకత పెంపు అంశంపై సెషన్ నిర్వహించారు. దీనిలో భట్టి విక్రమార్కతో పాటు విజన్ డాక్యుమెంట్‌లో కీలకపాత్ర పోషించిన ప్రొఫెసర్ ప్రసన్న తాంత్రి, ఐఎస్‌బీ ఫ్యాకల్టీ ఆదిత్య, పారిశ్రామికవేత్త పరశురాం పాక, ఐఏఎస్ అధికారి కృష్ణభాస్కర్ పాల్గొన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 కేవలం డాక్యుమెంట్ కాదు, భవిష్యత్ కోసం తాము చేస్తున్న ప్రతిజ్ఞ అని ఉపముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ఎకానమీ ప్రస్తుతం దాదాపు 185 బిలియన్ డాలర్ల వరకు ఉందని చెప్పారు. త్రీ ట్రిలియన్ డాలర్లు చేరుకునేందుకు 22 ఏళ్లలో 16 రెట్లు పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గుజరాత్, కరాటక సహా దేశంలోని ఏ రాష్ట్రం కూడా అంత స్థాయిలో వృద్ధి చెందలేదని, దేశ ఎకానమీ చరిత్రలో లేని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు పేర్కొన్నారు. కేవలం కష్టపడితేనే, మరిన్ని రోడ్లు.. భవనాలు కడితే మాత్రమే లక్ష్యాన్ని చేరుకోలేమని.. ఎకానమీ ప్రాథమిక సూత్రాలను మార్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. క్యాపిటల్, ఇన్నోవేషన్ కలిపి ఉత్పాదకత పెంచడం ద్వారా మాత్రమే ఇది సాధ్యమని పేర్కొన్నారు. డీప్ టెక్, ఏఐ, క్యాంటమ్ కంప్యూటింగ్‌లు ఇప్పుడు కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో తెలంగాణను ఆసియాకు ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దుతున్నట్లు వివరిం చారు. క్యూర్, ప్యూర్, రేర్‌తో ప్రాంతాల వారీ ప్రణాళికతో విజన్ డాక్యుమెంట్ వస్తోందని చెప్పారు.

## కేటీఆర్ మళ్లీ అమెరికా వెళ్తాడు

### మైనంపల్లి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, డిసెంబర్ 9 :** మైనంపల్లి హన్మంతరావు సంచలన కామెంట్స్ చేశారు. మాజీమంత్రి కేటీఆర్ మళ్లీ అమెరికా వెళ్లడం ఖాయం.. అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు విలక్షణమైన తీర్పునిచ్చారన్నారు. కాళేశ్వ రం, ఈ కార్, ఇలా అన్నింటా స్కామ్ చేసి పార్టీ ఫండ్‌ను కూడబెట్టుకున్నారని మైనంపల్లి అన్నారు. మైనంపల్లి హన్మంత రావు సంచలన కామెంట్స్ చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ మళ్లీ అమెరికా వెళ్లడం ఖాయం.. అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు విలక్షణమైన తీర్పునిచ్చారన్నారు. కాళేశ్వరం, ఈ కార్, ఇలా అన్నింటా స్కామ్ చేసి పార్టీ ఫండ్‌ను కూడబెట్టుకున్నారని మైనంపల్లి అన్నారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు విలక్షణమైన తీర్పునిచ్చార న్నారు. బీఆర్ఎస్ అధికారంలో కోల్పోయిన ఇంకా అధికారంలోనే ఉన్నట్టు ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. పది సంవత్సరాల్లో ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చని బీఆర్ఎస్ సోషల్‌మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం, ఈ కారు, ఇలా అన్నింటా స్కామ్ చేసి పార్టీ ఫండ్‌ను కూడబెట్టుకున్నారని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి ఆరోపించారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న మీడియా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన విజ్ఞప్తి చేశారు. మెదక్ జిల్లాలో 240 గ్రామ పంచాయతీలు ఉంటే 15 మంది ఏకగ్రీవమయ్యారన్నారు. స్థానిక సంస్థల్లో 80శాతం స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీలోనూ కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు.

# గుదిబండగా మారిన వీసాల జారీ




**ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన వైఖరితో వీసాల జారీ గుదిబండగా మారింది. అమెరికాలో చదవాలని ఎంతో మంది కలలు కంటుంటే వారి కలలకు అమెరికా అడ్డుకట్ట వేస్తోంది. అర్థంలేని ఆంక్షలతో భారతీయ విద్యార్థులపై కొరడా ఘుళిపిస్తుంది. ప్రపంచ దేశాలకు పెద్దన్న అయిన అమెరికాకు వెళ్లేందుకు చాలా మంది ఏటా ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. చదువు, ఉద్యోగం, వ్యాపారం, స్థిర నివాసం కోసం అమెరికా వెళ్తూ ఉంటారు. కానీ ఇప్పుడు అమెరికా అంటేనే స్టూడెంట్స్, పేరెంట్స్ తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ట్రంప్ ఎప్పుడు ఏం బాంబ్ పేలుస్తారో.. ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో.. దాని వల్ల తమకేం ఇబ్బందులు వస్తాయో అని ఆందోళన చెందుతున్నారు.**

ఈ ఏడాదిలో అమెరికా ఇచ్చే స్టూడెంట్ వీసాలకు అప్లై చేసుకునే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయింది. ఎంతలా అంటే కొవిడ్ సమయంలో కూడా ఇంతకు పడిపోవడం జరగలేదని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అమెరికాలో చదవాలని ఎంతో మంది కలలు కంటారు. అందుకోసం చాలా కష్టపడి చదివి.. అర్హత పరీక్షలు రాస్తారు. ఈసారి కాకపోతే వచ్చేసారి అంటూ ఏళ్ల తరబడి అమెరికా యూనివర్సిటీల్లో అడ్మిషన్ కోసం ఎదురు చూస్తూనే ఉంటారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను అమెరికాలో చదివించాలనే బలమైన పట్టుదలతో ఉంటారు. కానీ.. ప్రస్తుతం ఆ కలలు మొత్తం కల్లలు అవుతున్నాయి. రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తీసుకునే నిర్ణయాలు, విధిస్తున్న ఆంక్షలు, ప్రస్తుతం అక్కడి పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని.. అమెరికాలో చదవాలని భావించే భారత విద్యార్థులు.. వెనకడుగు వేస్తున్నారు. గతంలో కరోనా మహమ్మారి విస్తరించిన సమయంలో కంటే తక్కువగా.. ఈసారి స్టూడెంట్ వీసాలకు దరఖాస్తులు వచ్చినట్లు అమెరికా దౌత్య అధికారులు చెబుతున్నారు. అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలనే ఇండియన్ స్టూడెంట్స్ కలలు ఈ ఏడాది ఆరంభంలోనే సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. సాధారణంగా అమెరికా స్టూడెంట్ వీసాల సీజన్‌కు.. ప్రతీ ఏడాది మార్చి నుంచి జూలై నెలలు చాలా కీలకంగా ఉంటుంది. ఆగస్టు/సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యే ఫాల్ సెమిస్టర్‌కు సిద్ధమయ్యే విద్యార్థులు.. మార్చి నుంచి జూలై మధ్య వీసాల కోసం భారీగా దరఖాస్తు చేసుకుంటారు. అయితే తాజా గణాంకాలు భారతీయ విద్యార్థులకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

అమెరికా విదేశాంగ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది మార్చి నుంచి మే మధ్య కాలంలో జారీ అయిన ఎఫ్-1 (అకాడమిక్) (ఎఫ్-1) వీసాల సంఖ్య గణనీయంగా పడిపోయింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 27 శాతం తగ్గుదల నమోదైంది. ఈ ఏడాది కేవలం 9,906 ఎఫ్-1 వీసాలు మాత్రమే భారతీయ విద్యార్థులకు జారీ అయ్యాయి. అంతకుముందు 2023లో ఇదే కాలంలో 14,987 వీసాలు జారీ కాగా.. 2024లో 13,478 వీసాలు భారతీయ విద్యార్థులు పొందారు. మరీ ముఖ్యంగా.. కొవిడ్-19 మహమ్మారి తర్వాత అంతర్జాతీయ ప్రయాణాలు తిరిగి ప్రారంభమైన 2022 మార్చి నెల నుంచి మే నాటి 10,894 వీసాలతో పోలిస్తే.. ఈ ఏడాది మరింత తగ్గడం గమనార్హం. అమెరికా స్టూడెంట్ వీసాలు తగ్గడంలో కొన్ని కీలక కారణాలు ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ విద్యార్థులపై ట్రంప్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం ఇందుకు ప్రధాన కారణం అని తెలుస్తోంది. మరోవైపు.. ఇజ్రాయెల్ గాజా యుద్ధంలో భాగంగా పాలస్తీనా మద్దతు ఆందోళనల్లో పాల్గొన్న పలువురు విద్యార్థుల (కొందరు భారతీయ విద్యార్థులు) వీసాలను రద్దు చేయడం.. అలాగే మే 27వ తేదీ నుంచి జూన్ 18వ తేదీ వరకు కొత్త వీసా దరఖాస్తులను 2 వారాల పాటు నిలిపివేసి.. దరఖాస్తుదారుల సోషల్ మీడియా కార్యకలాపాలపై నిఘా (సోషల్ మీడియా వెట్టింగ్) పెట్టడం వంటి ఆంక్షలతో విదేశీ విద్యార్థులు.. అమెరికాలో చదువుకోవాలంటేనే ఆలోచించే పరిస్థితి నెలకొంది. ఈ వీసా అప్లికేషన్లు 2 వారాలు ఆపడం వల్ల కూడా వీసా దరఖాస్తులు తగ్గడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు.

అమెరికన్ యూనివర్సిటీలకు ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల్లో కోతలు విధించడం, అంతర్జాతీయ విద్యార్థుల నమోదుపై పెరుగుతున్న నిఘా వంటి సవాళ్లు కొత్తగా వచ్చి పడ్డాయి. పొలిటికో నివేదిక ప్రకారం.. మే నెలలో ట్రంప్ ప్రభుత్వం అమెరికా రాయబార కార్యాలయాలను, కాన్సులర్ విభాగాలను విద్యార్థి వీసా దరఖాస్తుదారులకు కొత్త ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను నిలిపివేయాలని ఆదేశించి.. వారి సోషల్ మీడియా వెట్టింగ్‌ను తప్పనిసరి చేయాలని ఆదేశించింది. జూన్ నాటికి.. ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం ఎఫ్, ఎమ్, జే కేటగిరీ వీసా దరఖాస్తుదారులకు స్క్రీనింగ్ ప్రక్రియను సులభతరం చేయడానికి వారి సోషల్ మీడియా ఖాతాలను పబ్లిక్‌గా ఉంచాలని సూచించింది. ఈ ఏడాది మొదట్లో వీసా దరఖాస్తులు నెమ్మదించినప్పటికీ.. గత కొన్నేళ్లుగా అమెరికాలో చదువుకునేందుకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పెరగడం గమనార్హం. ఓపెన్ డోర్స్ 2024 డేటా ప్రకారం.. 2023-24 అకడమిక్ ఇయర్‌లో చైనా విద్యార్థులను అధిగమించి.. అమెరికాలోనే అతిపెద్ద అంతర్జాతీయ విద్యార్థులుగా భారతీయ విద్యార్థులు నిలిచారు. అంతకుముందు అమెరికాలో చదువుకునే విదేశీ విద్యార్థుల్లో చైనీయులు అగ్రస్థానంలో ఉండగా.. వారిని భారతీయులు అధిగమించారు. ఇది అమెరికా విద్య పట్ల భారతీయ విద్యార్థులకు ఉన్న ఆసక్తిని, పోటీని తెలియజేసింది. అయితే.. 2024లో మొత్తం విద్యార్థి వీసా జారీల్లో తగ్గుదల కనిపించింది. ఆ తర్వాత ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన వైఖరితో ఆ సంఖ్య మరింత తగ్గింది. కొవిడ్ మహమ్మారి తర్వాత.. 2024లో భారతీయ పౌరులకు అమెరికా విద్యార్థి వీసాలు భారీగా తగ్గించినట్లు తెలుస్తోంది. జనవరి నుంచి సెప్టెంబర్ 2024 వరకు.. భారతీయ విద్యార్థులకు కేవలం ఎఫ్-1 వీసాలు 64,008 మాత్రమే జారీ అయ్యాయని తెలుస్తోంది. ఇదే 2023లో 1.03 లక్షలు.. 2022లో 93,181 నుంచి గణనీయమైన తగ్గుదల కనిపించింది.

# ప్రయాణికుల సమస్యలపై ఆరాతీయండి

- ఉన్నతాధికారులకు కేంద్ర మంత్రి ఆదేశం
- ఇండిగో సంక్షోభంపై మంత్రి రామ్మోహన్ దృష్టి
- ఎయిర్‌పోర్టులకు ప్రత్యేక బృందాల తరలింపు
- కొనసాగుతున్న ఇండిగో సంక్షోభం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 9 :** ఇండిగో విమాన సర్వీసుల్లో ఏర్పడిన అంతరాయం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది. దేశవ్యాప్తంగా విమానాశ్రయాల కార్యకలాపాలపై 24 గంటల సమీక్షను ప్రారంభించినట్లు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, ప్రయాణికుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఉన్నతాధికారులను ప్రధాన విమానాశ్రయాలకు పంపినట్లు ఆయన వెల్లడించారు. ఈ విషయంపై రామ్మోహన్ నాయుడు 'ఎక్స్' వేదికగా ప్రకటన చేశారు. "డిసెంబర్ 3వ తేదీ నుంచి ఇండిగో కార్యకలాపాల్లో సమస్యలు మొదలైనప్పటి నుంచి పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, డీజీసీఏ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నాయి," అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత పరిణామాలను "అసాధారణ పరిస్థితి"గా అభివరి?చిన ఆయన, ఉన్నతస్థాయిలో తక్షణ జోక్యం అవసరమని స్పష్టం చేశారు. ఇటీవల తమ మంత్రిత్వ శాఖ, డీజీసీఏ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎయిర్‌పోర్టులకు వెళ్లి తనిఖీలు చేయాలని, ప్రయాణికులతో మాట్లాడి వారి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని, ఎయిర్‌లైన్ సిబ్బంది సేవలపై ఆరా తీయాలని సూచించారు. ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను, గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగో, గత కొన్ని రోజులుగా కార్యాచరణ సవాళ్లను ఎదుర్కొంటోంది. దీంతో ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రధాన విమానాశ్రయాల్లో తీవ్ర అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ప్రయాణికులు సోషల్ మీడియాలో భారీ క్యూలు, చెక్-ఇన్ ప్రక్రియలో జాప్యం, విమానాల సమాచారంపై స్పష్టత లేకపోవడం వంటి సమస్యలపై ఫిర్యాదులు చేస్తున్నారు. క్షేత్రస్థాయి నుంచి అధికారుల నివేదికలు అందిన తర్వాత, రానున్న 24 గంటల్లో మంత్రిత్వ శాఖ సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసే అవకాశం ఉంది. దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభంలో చిక్కుకుంది. సిబ్బంది కొరతతో సతమతం అవుతున్న ఇండిగో.. తీరుతో ప్రయాణికుల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది. దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో ఇండిగో విమానాలు రద్దయ్యాయి.. అయితే.. కొన్ని విమానాలు మాత్రం ఆలస్యంగా నడుస్తున్నాయి.. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు గోవా, అహ్మదాబాద్‌లో సర్వీసులు రద్దయ్యాయి.. సాంకేతికలోపం, సిబ్బంది కొరతతో విమానసేవల్లో సమస్యలు మొదలయ్యాయి.. ఈ క్రమంలో ఇండిగో ఫ్లైట్స్ క్యాన్సిలేషన్స్ ఎఫెక్ట్ పెళ్లిళ్లు, శుభకార్యాలపై కూడా పడుతోంది.. ఓచోట కొత్త జంట వాళ్ల రిసెప్షన్‌కి వాళ్లే వెళ్లలేకపోతే.. మరోచోట పెళ్లికొడుకు ఎయిర్-పోర్ట్‌లో ఇరుక్కుపోయాడు.. ఈ వారం ఇండిగో విమానాల రద్దు కారణంగా వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు, అయితే ఈ అంతరాయం ముఖ్యంగా వధూవరులను తీవ్రంగా దెబ్బతీసింది. ఒక జంట వీడియో కాల్ ద్వారా తమ వివాహ రిసెప్షన్‌కు జరుపుకుంటే.. మరికొందరు వివాహ వేడుకలను రద్దు చేసుకోడానికి రెడీ అయ్యారు. కొందరైతే పెళ్లి వాయిదా వేయడం ఇష్టం లేక ఖరీదైన చార్టర్ ఫ్లైట్‌ను బుక్ చేసుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఓ యువకుడు తన వెడ్డింగ్ కార్డును చూపిస్తూ..ఎయిర్‌లైన్స్ సమస్య కారణంగా నా పెళ్లికి నేను హాజరుకాలేకపోతున్నాను అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వీడియోను తన ఎక్స్ ఖాతాలో షేర్ చేస్తూ..ఇది నా స్వంత పెళ్లి.. కానీ నేను వెళ్లలేకపోతున్నాను..ఏం చేయాలి యార్ అంటూ రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందించారు. ఓ యూజర్ ..అతను త్వరగా వివాహం చేసుకోవాలని, అతని సమస్యలన్నీ శాంతియుతంగా పరిష్కారమవ్వాలని, విమానాశ్రయాలలో చిక్కుకున్న ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని ప్రార్థిస్తున్నాను అంటూ స్పందించారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 9 :** రూపాయి బలహీనత ఎఫెక్ట్‌తో బంగారం, వెండి ధరలు భగభగ మండిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా బంగారం ధరలు లక్షా 30 వేల మార్క్ దాటి పరుగులు పెడుతున్నాయి.. ఇటీవల తగ్గినట్లే తగ్గిన పసిడి ధరలు.. మళ్లీ పెరుగుతూ రికార్డు స్థాయికి చేరుకుంటుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. అంతర్జాతీయంగా బంగారం ధరలు పెరుగుతుండటంతో.. దేశీయంగా కూడా పెరుగుతున్నాయని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. తాజాగా.. గోల్డ్ ధర తగ్గగా.. సిల్వర్ ధర పెరిగింది.. పలు వెబ్‌సైట్ల ఆధారంగా.. నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి రేట్లు ఈ కింది విధంగా ఉన్నాయి. హైదరాబాద్‌లో బంగారం 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,30,090 ఉంది.. 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,19,250 ఉంది. వెండి కిలో ధర రూ.1,99,000 ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,30,090, 22 క్యారెట్ల ధర రూ.1,19,250 ఉంది. కిలో వెండి ధర రూ.1,99,000 ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,30,240, 22 క్యారెట్ల ధర రూ.1, 19,400 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,90,000 ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,30,090, 22 క్యారెట్ల ధర రూ.1,19,250 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,90,000 లుగా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,30,910.. 22 క్యారెట్ల ధర రూ.1,20,000 ఉంది. వెండి కిలో ధర రూ.1, 99,000 లుగా ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1, 30,090, 22 క్యారెట్లు రూ.1,19,250 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,90,000 లుగా ఉంది. కాగా.. బంగారం, వెండి ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం ఎప్పటికప్పుడు మారుతుంటాయి.. అందుకే అన్ని ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.



## రేణుకా చౌదరి శునకం వివాదంపై బీజేపీ సీరియస్

### రాజ్యసభ చైర్మన్‌కు ప్రివిలేజ్ నోటీసులు అందజేత

**న్యూఢిల్లీ, డిసెంబర్ 9 :** కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిపై వచ్చిన హక్కుల ఉల్లంఘన నోటీసును రాజ్యసభ ఛైర్మన్ ప్రివిలేజ్ కమిటీకి పంపించారు. పార్లమెంట్ ప్రాంగణంలోకి శునకాన్ని తీసుకువచ్చి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ సభ్యులు ఇచ్చిన నోటీసుపై విచారణ జరపాలని కమిటీని ఆదేశించారు. ఇటీవల పార్లమెంట్ సమావేశాల ప్రారంభం రోజున రేణుకా చౌదరి తన వాహనంలో ఓ శునకాన్ని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఆమె చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆమె ప్రవర్తన సభా హక్కులను ఉల్లంఘించడమేనని ఆరోపిస్తూ బీజేపీ సభ్యులు బ్రిజ్ లాల్, ఇందు బాలగోస్వామి రాజ్యసభ ఛైర్మన్‌కు ప్రివిలేజ్ నోటీసులు అందజేశారు. ఈ నోటీసును పరిశీలించిన ఛైర్మన్, తదుపరి విచారణ నిమిత్తం హక్కుల కమిటీకి (ప్రివిలేజ్ కమిటీ) పంపారు. ఈ కమిటీ రేణుకా చౌదరి వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి, తన సిఫారసులతో కూడిన నివేదికను ఛైర్మన్‌కు సమర్పించనుంది. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ఈ వివాదంలో తదుపరి చర్యలు ఉండే అవకాశం ఉంది.

## వ్యక్తిగత వైరమే టారీఫ్ పెంపుకు కారణం

- రష్యా చమురు కొనుగోళ్లు కారణం కాదు
- ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్



**న్యూఢిల్లీ, డిసెంబర్ 9 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై భారీ మొత్తంలో సుంకాలు విధించిన విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడమే కారణమని ట్రంప్ చెప్పినప్పటికీ అసలు కారణం మాత్రం ఇది కాదని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ పేర్కొన్నారు. రష్యా చమురు కొనుగోళ్లు కేవలం ఒక సాకు మాత్రమేనని, వ్యక్తిగత వైరమే అసలు కారణమని ఆయన చెప్పారు. డొనాల్డ్ ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి కోసం ఎంతగా పాకులాడారో అందరికీ తెలిసిందేనని ఆయన గుర్తుచేశారు. శాంతి బహుమతి పొందడానికి ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలను తానే ఆపానంటూ ట్రంప్ ప్రచారం చేసుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే భారత్, పాక్ మధ్య అణు యుద్ధాన్ని నిలువరించినట్లు ట్రంప్ చెప్పుకున్నారు. ఇరు దేశాలనూ టారిఫ్ లతో బెదిరించి కాల్పుల విరమణకు అంగీకరించేలా చేశానని ప్రచారం చేసుకున్నారు. ఈ ప్రచారానికి పాక్ వంతపాడగా.. భారత్ మాత్రం ఎప్పటికప్పుడు ఖండించింది. పాకిస్థాన్ సైన్యం ప్రాధేయపడడంతోనే కాల్పుల విరమణకు అంగీకరించినట్లు ప్రధాని మోదీ పలు సందరాల్లో స్పష్టం చేశారు. ఈ విషయంలో అమెరికా సహా మరే ఇతర దేశ ప్రమేయం లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో తనకు క్రెడిట్ ఇవ్వలేదనే ఆగ్రహంతో భారత్ పై ట్రంప్ కక్ష పెంచుకున్నారని, ఆ కోపంతోనే భారీగా టారిఫ్ లు విధించారని రఘురామ్ రాజన్ ఆరోపించారు. ఈ విషయంలో ట్రంప్ ప్రచారానికి వంత పాడడం ద్వారా పాక్ ప్రయోజనం పొందిందని చెప్పారు. పాకిస్థాన్ పై 19 శాతం టారిఫ్ లు విధించిన ట్రంప్.. భారత్ పై మాత్రం 50 శాతం సుంకాలు వడ్డించడానికి ఇదే కారణమని చెప్పారు.



## శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరోసారి బాంబు బెదిరింపులు

### అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు అధికారులు

**హైదరాబాద్, డిసెంబర్ 9 :** మరోసారి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపులు వచ్చాయి. విమానంలో బాంబు ఉందంటూ బెదిరింపు మెయిల్ వచ్చింది. బాంబు పేలకూడదంటే మిలియన్ డాలర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మెయిల్‌తో అప్రమత్తమైన శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు.. ఐసోలేషన్ బే దగ్గర ఫ్లైట్‌ని ఉంచి పూర్తి స్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఆ అనుమానాస్పద మెయిల్ న్యూయార్క్ నుంచి వచ్చినట్టు నిర్ధారించారు. ఎలాంటి ము ప్పు లేదని సెక్యూరిటీ టీమ్ క్లారిటీ ఇచ్చింది. ఈ ఏడాదిలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి 20కిపైగా బెదిరింపు కాల్స్, మెయిల్స్ వచ్చాయి. 5 ఘటనల్లో నిందితుల గుర్తించారు. మిగతా కేసుల్లో విచారణ కొనసాగుతోంది.



## సర్పంచ్ అభ్యర్థి ఆత్మహత్య

- ఓటమి భయంతో ఘాతుకం
- సంగారెడ్డి జిల్లాలో ఘటన

**హైదరాబాద్, డిసెంబర్ 9 :** తెలంగాణలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల ప్రక్రియ తీవ్ర ఒత్తిడితో కూడిన వాతావరణంలో సాగుతోంది. ఈ క్రమంలో పలుచోట్ల విషాదకర సంఘటనలు చోటుచేసుకున్నాయి. సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో ముగ్గురు అభ్యర్థులు మృతి చెందగా, సిద్దిపేట జిల్లాలో ఓ అభ్యర్థిపై కేసు నమోదైంది. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం పిప్పడ్‌పల్లి గ్రామ సర్పంచ్‌గా కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేస్తున్న సీహెచ్ రాజు (36) ఆత్మహత్య చేసుకున్నారు. ఎన్నికల్లో ఓడిపోతాననే ఆందోళనతో, నమ్మినవాళ్లే ప్రచారానికి రావడం లేదన్న మనోవేదనతో ఆయన చెట్టుకు ఉరేసుకుని మరణించారు. ఆదివారం రాత్రి తోటి అయ్యప్ప స్వాములతో తన ఆవేదన పంచుకోగా, వారు ధైర్యం చెప్పినప్పటికీ సోమవారం ఉదయం ఆయన విగతజీవిగా కనిపించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మంచర్లగూడలో 8వ వార్డుకు పోటీ చేస్తున్న పల్లె లత (42) ప్రచారం నిర్వహిస్తుండగా గుండె నొప్పితో కుప్పకూలిపోయారు. మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే కన్నుమూశారు. అలాగే, సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం చక్రియాల గ్రామంలో 8వ వార్డు అభ్యర్థి కొత్తొల్ల పద్మారావు (50) ఆదివారం రాత్రి ప్రచారం ముగించుకుని ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి నిద్రలోనే గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మరణంతో ఆ వార్డులో పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య రెండుకు చేరిందని, ఎన్నికలకు ఎలాంటి ఆటంకం లేదని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వంగపల్లిలో సర్పంచ్ అభ్యర్థి చల్ల కమలాకర్ రెడ్డి బాండ్ పేపర్‌పై హామీలు ఇస్తూ ప్రచారం చేస్తున్నారని పేర్కొంటూ, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందుకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## సాంబారు పాత్రలో పడి బాలుడి దుర్మరణం

### పెద్దపల్లి జిల్లా గురుకులంలో ఘటన

**హైదరాబాద్, డిసెంబర్ 9 :** నాలుగేళ్ల బాలుడు ప్రమాదవశాత్తూ వేడి సాంబారు పాత్రలో పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశాడు. తెల్లారితే బాబు పుట్టిన రోజు వేడుక జరుపుకోవాల్సిన తరుణంలో కొడుకు మరణించడంతో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని మల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, బాలుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా కోటపల్లికి చెందిన మొగిలి మధుకర్ మల్లాపూర్ గురుకుల హాస్టల్ లో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి హాస్టల్ లోని సిబ్బంది కోసం కేటాయించిన క్వార్టర్స్ లో ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం హాస్టల్ లో విద్యార్థుల కోసం మధుకర్ సాంబారు సిద్ధం చేశాడు. మిగతా వంటకాలు సిద్ధం చేస్తుండగా మధుకర్ కొడుకు మోక్షిత్ (4) అక్కడే ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ మోక్షిత్ సాంబారు పాత్రలో పడిపోయాడు. సాంబార్ వేడిగా ఉండడంతో మోక్షిత్ కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మోక్షిత్‌ను కరీంనగర్ ఆసుపత్రికి అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ బాలుడు చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. సోమవారం మోక్షిత్ బర్త్ డే కావడంతో ఆదివారం సాయంత్రం ధర్మారం వెళ్లాలని మధుకర్ భావించాడు. వంట పనులు త్వరగా పూర్తిచేసుకుని కొడుకు పుట్టిన రోజు కోసం కొత్త దుస్తులు, కేకు, ఇతర సామాగ్రి తీసుకురావాలని అనుకున్నాడు. ఇంతలోనే ఈ దురటన చోటుచేసుకుంది. పుట్టిన రోజున ఆనందోత్సాహాలతో గడపాల్సిన ఇంటికి బాలుడు విగతజీవిగా రావడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



# 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యానికి తెలంగాణ దూసుకెళ్తుంది

- ఆవిష్కరణలే భవిష్యత్ వృద్ధికి పునాది
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్:** గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహించిన 'క్యాపిటల్ మరియు ప్రొడక్టివిటీ ఫర్ 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ' చర్చా గోష్టికి డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాబోయే 22 ఏళ్లలో తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని ఆయన స్పష్టం చేశారు. ఆ లక్ష్యాన్ని సాధించాలంటే పెట్టుబడులకు ఆవిష్కరణలు జోడించాల్సిన అవసరం ఉందని, "మూలధనం ఆవిష్కరణ = ఉత్పాదకత" అనే సమీకరణమే భవిష్యత్ వృద్ధికి అసలు బలం అని వివరించారు. ఉత్పాదకత పెరిగితేనే పౌరుల ఆదాయం, సామాజిక గౌరవం పెరుగుతాయని పేర్కొన్నారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' తర్వాతి దశలో తెలంగాణ 'ఈజ్ ఆఫ్ ఇన్నోవేటింగ్' వైపు అడుగులు వేస్తుందని తెలిపారు. ఇకపై రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులేటర్‌గా కాకుండా, ఇన్నోవేషన్‌కు క్యాటలిస్ట్‌గా, భాగస్వామిగా వ్యవహరించే విధానాన్ని అవలంబిస్తుందని చెప్పారు. తెలంగాణ 'రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా క్యూర్ (అర్బన్), ప్యూర్ (పెరి–అర్బన్), రేర్ (రూరల్) నమూనాలతో ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. డీప్‌టెక్, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతికతలు గ్రామీణ రైతుల ఉత్పాదకత పెంపుకు కూడా ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.




# అవినీతి లేని సమాజం మన అందరి సంయుక్త లక్ష్యం

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, డిసెంబర్ 9:** అవినీతి వ్యతిరేక పోరాటంలో ప్రతి పౌరుడూ భాగస్వామ్యులవ్వాలని, పారదర్శక పాలనకు తోడ్పడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏసీబీ ఆధ్వర్యంలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ, ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కలెక్టర్ చేతుల మీదుగా అవినీతి వ్యతిరేక దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలిసి అవినీతి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అవినీతి నిర్మూలనలో విద్యార్థులు, యువత కీలక పాత్ర పోషించాలి. ప్రభుత్వ ఉద్యోగులెవ్వరైనా లంచం అడిగితే వెంటనే 1064 టోల్ ఫ్రీ నంబర్ కు సమాచారం ఇవ్వాలి. ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ సిబ్బంది ధర్మం అని పమేలా సత్పతి పేర్కొన్నారు. కర్తవ్యపరమైన వైఖరితో, బాధ్యతతో పనిచేయాలంటూ అధికారులు, ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్, ఇన్స్‌పెక్టర్ కృష్ణకుమార్‌తో పాటు అధికారులు, ఉద్యోగులు, ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.



# ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి

## సీఐ జానకి రామ్ రెడ్డి

**పాలకుర్తి :** పాలకుర్తి మండలంలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా మంగళవారం రోజు పాలకుర్తి సీఐ జానకిరామ్ రెడ్డి వల్మిడి క్లస్టర్ లోని, వల్మీడీ గ్రామపంచాయతీని సందర్శించి వల్మిడి, ముత్తారం, మంచిపుల గ్రామాలలో గ్రామపంచాయతీ సర్పంచులుగా, వార్డు మెంబర్లుగా పోటీ చేయబోయే అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అభ్యర్థులందరు ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా మసులు కోవాలని, ప్రజలందరూ కూడా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని లేనిపోని గొడవలకు పాల్పడి కేసుల పాలు కాకూడదు అని ఈ సందర్భంగా పోటీ చేయబోయే అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడినారు. ఇటి కార్యక్రమంలో కానిస్టేబుల్ రాజ్ కుమార్ వెంకటరమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



# కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం

**నిజామాబాద్ :** బాన్సువాడ నియోజక వర్గం వర్ని, రుద్రూర్, కోటగిరి, పోతంగల్ మండలాల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు ,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, కాసుల రోహిత్ కోటగిరి మండలం జల్లపల్లి అబాది లో జరిగిన అభివృద్ధి పనులను, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయించిన సర్పంచ్ అభ్యర్థి వివేక్ మాత్రమే అని, మీ విలువైన ఓటును బ్యాటు గుర్తుకు వేసి వివేక్ ని అత్యధిక మెజారిటీతో సర్పంచ్ గా గెలిపించాలని కోరారు.





# తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

## అలరించిన సంస్కృతిక కార్యక్రమం


**మేడ్చల్ బ్యూరో, డిసెంబర్ 09 (జనంవార్త) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన విజయోత్స వాలలో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యాలయాల ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మంగళవారం ఘనంగా ఆవిష్క రించారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ప్రభుత్వ ప్రజా పాలన సంక్షేమంపై ఆలపించిన పాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, ఆర్డిఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాంప్రకాష్,వివిధ శాఖల జిల్లా అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది,నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి,కౌకుట్ల కృష్ణారెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సప్తగిరి రైస్ మిల్లులో నిలువు దోపిడీ

- విచారణకు సిపిఐ డిమాండ్
- రైతుల చెమటను దోచుకుంటున్న మిల్లు వ్యాపారి
- సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

**హుజురాబాద్, డిసెంబర్ 9:** జమ్మికుంట ఐకెపి కేంద్రాల నుంచి సేకరించిన ధాన్యంపై సప్తగిరి ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో జరుగుతున్న భారీ అవకతవకలను బహిర్గతం చేస్తూ, వెంటనే ఉన్నతస్థాయి విచారణ జరపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జమ్మికుంట పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్కారు అలాట్ చేసిన ధాన్యం మిల్లులోకి చేరాక తేమ, తాలు, తప్ప పేర్లతో క్వింటాళ్ల కొద్దీ లోటు చూపిస్తూ రైతులను నేరుగా దోపిడీ చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఒక్కో రైతు వద్ద నుంచి 10, 20, 30 క్వింటాళ్ల వరకూ వ్యత్యాసం చూపించి మిల్లు వ్యాపారి కోట్ల రూపాయలు లబ్ధి పొందుతున్నాడని ఆరోపించారు. ఐకెపి కేంద్రాల నిర్వాహకులు, కొంతమంది అధికారులు కనుసన్నల్లోనే ఈ దందా నడుస్తోందన్న అనుమానం బలపడుతోందన్నారు. రైతులు వానకు వణికుతూ రోజులు తరబడి వడ్లు ఆరబెట్టి, తేమ శాతం తగ్గాక విక్రయించుకున్నా చివరికి మిల్లులో మళ్లీ దోపిడీ బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర రైతుకు అందని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. సప్తగిరి మిల్లు గతంలో కూడా ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యం సకాలంలో ఇవ్వకపోయినా చర్యలు తీసుకోకపోవడం దందాకు పెన్నుముద్ర వేసిందని అన్నారు. బ్యాంకు గ్యారంటీలు చెల్లిస్తూ అదే దోపిడీ పద్ధతిని కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కేటాయింపులకు మిల్లు సరైన పూచీకత్తులు ఇవ్వకపోయినా అధికారులే నిర్లక్ష్యం వహించడం విచారకరం అన్నారు. వందలాది మంది రైతుల వద్ద జరిగిన ఈ భారీ దోపిడీని ప్రభుత్వం వెంటనే రికవరీ చేసి, సంబంధిత మిల్లుపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సిపిఐ జమ్మికుంట మండల కార్యదర్శి గజ్జి ఐలయ్య, వీణవంక మండల కార్యదర్శి రాంగోపాల్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేటితో ప్రచారానికి తెర ప్రలోభాలకు ఎర



**ఇనుగుర్తి :** గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో ఇంతకాలం హోరెత్తించిన మైకులు మూగబోయాయి. ఎన్నిక ల కమిషన్ సూచనల మేరకు మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి అభ్యర్థులు తమ ప్రచారాలు ముగించారు. నవంబర్ 27న రాష్ట్ర ఎన్నికల కమిషన్ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేయగా, అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరించగా అభ్యర్థులు ప్రచారాలు ప్రారంభించారు నవంబర్ 30తో నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో అభ్యర్థులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లారు రాత్రనకా పగలనకా ప్రజలతో మమేకమవుతూ ఓట్ల వేటలో మునిగిపో యారు సభలు సమావేశాలతో ప్రచారం హోరెత్తించారు అభ్యర్థులతో పాటు ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు ఇతర ప్రముఖులు కూడా అలుపెరుగకుండా ప్రచారంలో పాల్గొన్నారు మంగళవారంతో మొదటి విడత ప్రచారం ముగియడంతో ఇక ఉన్నదంతా ఓటర్లను ప్రసన్నం చేసుకోవడమా లేక మద్యం డబ్బులతో ప్రలోభాలకు గురి చేయడమో, అందితే కాళ్లు మాత్రమే మిగిలి ఉన్నదని గ్రామాలలో బహిరంగంగా గుసగుసలు వినిపిస్తున్నాయి గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రచారం ముగియడంతో ప్రలోభాలకు తెరలేచే అవకాశం ఉండటంతో పోలీసులు ఆ దిశగా దృష్టి సారిస్తున్నారు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వస్తువులు నగదు సరఫరా కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు ఎస్సై జి కరుణాకర్ తెలిపారు 11 వ తారీకు ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికల ప్రక్రియ జరుగుతుందని ఆ తర్వాత ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమై సాయంత్రం వరకు పూర్తి చేస్తారని కావున 11వ తారీఖు సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉందని ఈ సమయంలో ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది తిరుగుకూడదని ఎస్సై

# పోచారం గ్రామపంచాయతీ ఏకగ్రీవం

## గ్రామ సర్పంచ్‌గా రమేష్



**కామారెడ్డి :** బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పుట్టిన ఊరు, పెరిగిన ఊరు పోచారం గ్రామపంచాయతీ ఏకగ్రీవంగా సర్పంచులు ఆ గ్రామస్తులు ఎన్నుకున్నారు. 1984 కంటే ముందు పోచారం గ్రామం ఇబ్రహీంపేట్ గ్రామపంచాయతీ పరిధిలో ఉండేది. 1984 లో పోచారం గ్రామపంచాయతీగా ఏర్పాటయింది. పోచారం శ్రీనివాస్ రెడ్డి స్వగ్రామమైన ఈ గ్రామంలో 4ఏళ్లుగా ఎన్నికలు జరగలేదు. అన్ని ఏకగ్రీవమే దీనికి కారణం పోచారం శ్రీనివాస్ రెడ్డి గ్రామ అభివృద్ధికి చేసిన కృషి ఫలితమే ఆ ఆ గ్రామం లో ఏకగ్రీవంగా సర్పంచులు అందరు కలిసి ఎన్నుకుంటారు. 2025 లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పోచారం గ్రామపంచాయతీ ఏకగ్రీవంగా సర్పంచ్ పదవితో పాటు 8 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డాయి. ఈ గ్రామపం చాయతీ ఎస్టీకి రిజర్వుడు కావడం వల్ల గిరిజన యువకుడు విద్యావంతుడు అయినటువంటి రమేష్ అనే వ్యక్తికి పోచారం గ్రామ సర్పంచ్ గా గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూడో విడతలో జరుగుతున్న ఈ ఎన్నికలకు మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ ఉండడంతో పోచారం గ్రామ పంచాయతీకి రమేష్, ఎనమిది మంది వార్డు సభ్యులు నామినేషన్లు వేశారు. వీరికి వ్యతిరేకంగా ఎవరు కూడా నామినేషన్లు వేయకపోవడంతో రమేష్ అనే గిరిజను యువకుడు గ్రామ సర్పంచ్ గా ఏకైకంగా ఎన్నుకోబడ్డారు. ఇంకా అధికారులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది నూతనంగా గ్రామ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డ రమేష్ ను ఆయనతో ముట్టొచ్చింది ముచ్చటించారు. తనను పోచారం గ్రామ సర్పంచ్ గా ఎన్నుకున్న గ్రామపంచాయతీ గ్రామస్తుల కు, ముఖ్యంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పోచారం శ్రీనివాసరెడ్డి అండ దండలతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి బాన్సువాడ నియోజకవర్గం లోని ఓ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి తాను కృషి చేస్తారని నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డ రమేష్ వెల్లడించారు. ఎలాంటి వర్గాలకు చోటు కల్పించకుండా, పార్టీలకు అతీతంగా ఉంటూ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని రమేష్ ఈ సందర్భంగా వెల్లడించారు.

# హైదరాబాద్‌ను ఫిల్మ్ గ్లోబల్ అభివృద్ధికి సహకారం

- సిఎం రేవంత్ ఆప్యాయంగా పిలిచినందుకు థాంక్స్
- మెగాస్టార్ చిరంజీవి వెల్లడి



**హైదరాబాద్, డిసెంబర్ 9 :** హైదరాబాద్‌ను ఫిలిమ్ గ్లోబల్ హబ్‌గా చేయాలనే అంశాన్ని ముఖ్యమంత్రి ఎంతో ధైర్యంగా నాతో చెప్పారని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. ఫ్యూచర్ సిటీకి అన్ని రకాల సెక్టార్లను ఆహ్వానించడం రేవంత్ రెడ్డి ఒక్కరికే సాధ్యమైందని ఈ సందర్భంగా చిరంజీవి తెలిపారు. తెలంగాణాలో అన్ని వనరులు ఉన్నాయని.. ప్రపంచానికి హైదరాబాద్ సినిమా హబ్ గా మార్చేందుకు తామంతా సీఎం వెంట ఉంటామని హామీ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీలో రెండో రోజు జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో టాలీవుడ్ నటుడు మెగాస్టార్ చిరంజీవి పాల్గొన్నారు. తనపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి ఆహ్వానిం చారని ఈ సందర్భంగా మెగాస్టార్ గుర్తుచేశారు. సీఎం కోరిక మేరకు ఎంతో ఆనందంగా ఇక్కడకు వచ్చానని చెప్పారు. ఇదో గొప్ప సమ్మిట్ అని కొనియాడారు. ఈ సమ్మిట్ కోసం ఆహ్వానించేందుకు భట్టి విక్రమార్క తన వద్దకు వచ్చారని చిరు పేర్కొన్నారు. సినిమా షూటింగ్ సందర్భంగా ఆ సమయంలో తాను హీరోయిన్‌తో డ్యాన్స్ చేస్తూ ఉన్నానని చెప్పుకొచ్చారాయన. 'గొప్ప సమ్మిట్ ఇది. తెలంగాణ రైజింగ్ కొత్త ఇనిషియేటివ్. చాలా ఆనందంతో ఇక్కడికి వచ్చాను. చిరంజీవిని ఒక్కడినే ఇక్కడ కూర్చోబెట్టారని ఎవరూ అనుకోవద్దు. సినిమా సొసైటీ గురించి తెలిసిన వ్యక్తిగా నన్ను ఆహ్వానించారు. పరిశ్రమ మనిషిగా మాత్రమే ఇక్కడకు వచ్చాను. యువతను గురించి మాట్లాడుతూ.. ఎంటర్‌టైన్మెంట్ వైపునకు మళ్లిస్తే వ్యసనాలకు దూరమయ్యే అవకాశముందన్నారు. సరైన మౌలిక వసతులను కల్పిస్తే సినీ పరిశ్రమ గ్లోబల్ హబ్‌గా మారుతుందని చిరు వివరించారు. ప్రపంచం మొత్తం హైదరాబాద్ వైపు చూసేలా తాము సహకరిస్తామని ఫ్యూచర్ వేదికగా మెగాస్టార్ ప్రకటించారు.

# ప్రభాకర్ రావు బెయిల్ పిటిషన్ రద్దు కేసు

## విచారణ నేటికి వాయిదా వేసిన సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 9 :** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు బెయిల్ రద్దు చేయాలంటూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారానికి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం విచారించి.. ఈ నిర్ణయం తీసుకుంది. ఈ పిటిషన్‌పై నవంబర్ 18వ తేదీనే వాదనలు జరగాల్సి ఉంది. కానీ ప్రభాకర్ రావు తరఫు న్యాయవాది అందుబాటులో లేకపోవడంతో.. ఈ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా పడింది.ఇక ఈ కేసులో కీలక ఆధారాలను ప్రభాకర్ రావు ధ్వంసం చేశారంటూ సుప్రీంకోర్టును ప్రభుత్వం ఆశ్రయించింది. డిజిటల్ ఎక్విప్‌మెంట్, పాస్ వర్డ్ ఇవ్వకుండా విసిగించడంతోపాటు విచారణకు ఆయన ఏ మాత్రం సహకరించడం లేదని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టుకు తమ వాదనలను వినిపించారు. దీంతో ఫోరెన్సిక్ నిపుణుల ముందు ఐ క్లౌడ్, పాస్ వర్డ్ రీసెట్ చేయాలని గత విచారణలో ప్రభాకర్ రావును సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష పార్టీల నేతలపైనే కాకుండా.. స్వపక్షంలోని పలువురి కీలక నేతలపై ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదే విషయాన్ని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అగ్రనేతలు సైతం ఆరోపించారు. 2023 ఏడాది చివరిలో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో.. కాంగ్రెస్ పార్టీకి ఓటరు పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరింది. ఫోన్ ట్యాపింగ్ అంశంపై వాస్తవాలు వెలికి తీయాలంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్)ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్‌లో కీలకంగా వ్యవహరించిన పలువురు ఉన్నతాధికారులను సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. దాంతో ఫోన్ ట్యాపింగ్ జరిగింది వాస్తవమని సిట్ అధికారుల ధృవీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉన్నతాధికారులను అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసులో అత్యంత కీలకంగా వ్యవహరించిన ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు.. అమెరికాలో ఉన్నారు. ఆయనను భారత్‌కు రప్పించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పలు ప్రయత్నాలు చేసింది. ఈ విషయం తెలుసుకున్న ప్రభాకర్ రావు.. సిట్ అధికారులు అరెస్ట్ చేయకుండా ఉండాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రభాకర్ రావును ముందస్తు అరెస్ట్ చేయవద్దంటూ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అనంతరం ఈ కేసు విచారణకు హాజరైన ప్రభాకర్ రావు.. సిట్ అధికారులు సంధించిన పలు ప్రశ్నలకు ఎటువంటి సమాధానాలు ఇవ్వలేదు. మరోవైపు ప్రభాకర్ రావుకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఆయన బెయిల్ రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టును రేవంత్ ప్రభుత్వం ఆశ్రయించింది. ఈ కేసును బుధవారానికి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

జనం వార్త

# భారత్ బియ్యంపై అదనపు సుంకాలు!

## ట్రంప్ సంకేతాలు

**యూఎస్ :** ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించి భారత్–అమెరికా చర్చలకు సిద్ధమవుతుండగా ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్ నుంచి దిగుమతయ్యే బియ్యంపై అదనపు సుంకాలు విధించాలనే యోచనలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉన్నట్లు తెలుస్తోంది. చౌకైన విదేశీ వస్తువులు అమెరికా ఉత్పత్తిదారులను దెబ్బతీస్తున్నాయని అక్కడి రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ట్రంప్ అదనపు సుంకాల గురించి యోచిస్తున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి.
అమెరికా రైతుల కోసం 12 బిలియన్ డాలర్ల బెయిల్ అవుట్ ప్యాకేజీ ప్రారంభానికి వైట్‌హౌస్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న ట్రంప్ మాట్లాడుతూ.. పలు దేశాలు చౌక ధరలకే బియ్యాన్ని అమెరికా మార్కెట్‌లోకి డంప్ చేస్తున్నాయంటూ వస్తున్న వాదనలను తమ ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న కొందరు రైతులు సబ్సిడీ బియ్యం దిగుమతులు అమెరికా మార్కెట్‌లను దెబ్బతీస్తున్నాయని, దేశీయ ధరలను తగ్గిస్తున్నాయని వాదిం చారు. దీనిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రంప్ మాట్లాడుతూ.. వారు (పలు దేశాలను ఉద్దేశిస్తూ) మోసం చేస్తున్నారని.. సుంకాల విధింపు మార్గాన్ని అనుసరించవచ్చని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కెనడా నుంచి ఎరువుల దిగుమతుల పైనా ఆయన ప్రస్తావించారు. ఓ రైస్‌మిల్ సీఈఓ మెరిల్ కెన్నెడీ మాట్లాడుతూ.. అగ్రరాజ్యా నికి తమ ఉత్పత్తులను డంప్ చేస్తున్న దేశాల్లో భారత్, థాయ్ లాండ్, చైనాలు ప్రధానంగా ఉన్నాయన్నారు. చైనా వస్తువులు ఏకంగా ప్యూర్టోరికోలోకి కూడా వెళ్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అనేక సంవత్సరాలుగా తామే ప్యూర్టోరికోకు బియ్యం ఎగుమతులు చేయడం లేదని వెల్లడించారు. వీటన్నిం టివల్ల దక్షిణాదిలో తాము అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు విధించిన సుంకాలు పని చేస్తున్నాయని.. అయితే, వాటిని రెట్టింపు చేయాలని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. వివిధ దేశాలపై విధించిన సుంకాలను పెంచాలా అని అడిగారు. ఇందుకు రైతులు బదులిస్తూ ఇతర దేశాల నుంచి వచ్చే ఉత్పత్తులను నియంత్రించాలని కోరారు. అమెరికా రైతుల ఉత్పత్తులను దెబ్బతీసేలా ఉన్న దేశాల జాబితాను సమర్పించాల ని వాణిజ్య కార్యదర్శి స్కాట్ బెసెంట్‌ను ట్రంప్ ఆదేశించారు. స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ.. వీటిలో భారత్, థాయ్‌లాండ్, చైనాలు ముందున్నాయన్నారు. మరిన్ని దేశాలు కూడా ఉన్నాయని, దీనికి సంబంధించి పూర్తి జాబితా అందిస్తామని తెలిపారు. వీటిపై సత్వరం చర్యలు తీసుకుంటామని ట్రంప్ హామీ ఇచ్చారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి సంబం ధించిన చర్చల ప్రారంభానికి ముందే ట్రంప్ అదనపు సుంకా ల గురించి ఆలోచనలు చేయడం గమనార్హం. ఇక, భారత్– అమెరికాల మధ్య ట్రేడ్ డీల్‌కు సంబంధించిన చర్చలు ఈనెల 10 నుంచి దిల్లీలో జరగనున్నాయి. ఇందులో పాల్గొనేందుకు అమెరికా డిప్యూటీ వాణిజ్య ప్రతినిధి రిక్ స్విట్జర్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మన దేశంలో పర్యటించనున్నారు. ఈ చర్చల్లో భారత్ తరఫున వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ పాల్గొనున్నారు.





## ఇండోనేషియాలో అగ్నిప్రమాదం

### పలువురు మృతి

**ఇండోనేషియా:** ఇండోనేషియా రాజధాని జకార్తాలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది ఏరియల్ సర్వే కోసం ఉపయోగించే డ్రోన్లు తయారు చేసే ఏడంతస్తుల కార్యాలయంలో మంగళవారం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అనేకమంది అందులో చిక్కుకున్నట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ ఘటనలో 20మంది ప్రాణాలు కోల్పోగా అనేకమంది మంటల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అగ్నికీలలు సమీపంలోని భవనాలకు వ్యాపించడంతో అక్కడి ప్రజలను ఇళ్లు ఖాళీ చేయించి.. సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. కార్యాలయ భవనంలోని మొదటి అంతస్తులో ఉన్న గోదాంలోని బ్యాటరీ పేలడంతో మంటలు అంటుకున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. మంటలు పైఅంతస్తులకు వ్యాపించడంతో భవనంలో అనేకమంది చిక్కుకున్నారని.. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్నామని తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక బృందాలు మంటలు ఆర్పడానికి శ్రమిస్తున్నాయన్నారు.



## సౌదీలో మద్యం అమ్మకాలపై నిబంధనల సడలింపు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 9 :** సౌదీ అరేబియా ప్రభుత్వం మద్యం అమ్మకాల విషయంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో నివసిస్తున్న ముస్లిమేతర విదేశీయులకు మద్యం కొనుగోలు చేసేందుకు మరిన్ని సడలింపులు ఇచ్చింది. నెలకు 50,000 రియాల్స్ (సుమారు 13,300 డాలర్లు) లేదా అంతకంటే ఎక్కువ జీతం ఉన్నవారు ఇప్పుడు మద్యం కొనుగోలు చేయవచ్చు. ఈ నిబంధన ప్రకారం, అర్హులైన విదేశీయులు తమ జీతం వివరాలను ధ్రువీకరించే సర్టిఫికెట్‌ను చూపించి, రాజధాని రియాద్‌లో ఉన్న ఏకైక మద్యం విక్రయ కేంద్రంలోకి ప్రవేశం పొందాల్సి ఉంటుంది. గత ఏడాది విదేశీ దౌత్యవేత్తల కోసం ప్రారంభమైన ఈ స్టోర్‌లోకి, ఇప్పుడు 'ప్రీమియం రెసిడెన్సీ' హోదా కలిగిన ముస్లిమేతరులకు కూడా ప్రవేశం కల్పించారు. నెలవారీ పాయింట్ల ఆధారిత కోటా పద్ధతిలో ఇక్కడ అమ్మకాలు జరుగుతాయి. విదేశీ నిపుణులను, పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో సౌదీ ప్రభుత్వం ఈ సామాజిక సంస్కరణలను చేపడుతోంది. రియాద్‌ను అంతర్జాతీయ వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో భాగంగానే ఈ సడలింపులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా సౌదీలో మహిళల డ్రైవింగ్‌పై నిషేధం ఎత్తివేయడం, సినిమా థియేటర్లు, వినోద కార్యక్రమాలకు అనుమతివ్వడం వంటి అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. రియాద్‌తో పాటు దేశంలోని మరో రెండు నగరాల్లో కూడా కొత్త మద్యం దుకాణాలను ఏర్పాటు చేయబోతున్నట్లు సమాచారం.

## కాశ్మీర్‌లో చైనా జాతీయుడి అరెస్ట్..

**న్యూఢిల్లీ, డిసెంబర్ 9 :** వీసా నిబంధనలను ఉల్లంఘించి, ఎలాంటి అనుమతి లేకుండా కశ్మీర్, లడఖ్ లలోని అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతాల్లో పర్యటించిన చైనా జాతీయుడిని శ్రీనగర్‌లో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. దేశ భద్రతకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని ఏమైనా లీక్ చేశాడా? అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. వివరాల్లోకి వెళితే, హూ కాంగ్‌తాయ్ (29) అనే చైనా పౌరుడు నవంబర్ 19న టూరిస్ట్ వీసాపై ఢిల్లీకి వచ్చాడు. నిబంధనల ప్రకారం వారణాసి, ఆగ్రా, జైపూర్, గయ వంటి కొన్ని బౌద్ధ క్షేత్రాలను మాత్రమే అతను సందర్శించాలి. కానీ అతడు ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ లో నమోదు చేసుకోకుండానే లడఖ్‌లోని లేహ్, జన్స్కర్‌తో పాటు కశ్మీర్ లోయలోని పలు వ్యూహాత్మక ప్రాంతాల్లో పర్యటించాడు. జన్స్కర్‌లో మూడు రోజుల పాటు ఉండి, స్థానిక బౌద్ధారామాలతో పాటు వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రదేశాలను సందర్శించాడు. దక్షిణ కశ్మీర్‌లోని ఆర్మీ విక్టర్ ఫోర్స్ హెడ్ క్వార్టర్స్ సమీపంలో ఉన్న అవంతిపుర బౌద్ధ శిథిలాలతో పాటు హజ్రత్‌బల్ దర్గా, శంకరాచార్య హిల్, దాల్ సరస్సు వంటి ప్రాంతాల్లో అతని కదలికలు అనుమానాలకు తావిచ్చాయి. భారత్‌కు వచ్చిన వెంటనే బహిరంగ మార్కెట్‌లో ఒక ఇండియన్ సిమ్ కార్డును కూడా సంపాదించడం గమనార్హం. అతడి ఫోన్‌లోని బ్రౌజింగ్ హిస్టరీలో సీఆర్పీఎఫ్ మోహరింపు, ఆర్టికల్ 370 రద్దు వంటి అంశాల గురించి వెతికినట్లు అధికారులు గుర్తించారు. విచారణలో తాను అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో ఫిజిక్స్ చదివానని, గత తొమ్మిదేళ్లుగా అక్కడే ఉంటున్నానని హూ కాంగ్‌తాయ్ తెలిపాడు. తనకు ప్రయాణాలంటే ఇష్టమని, వీసా నిబంధనల ఉల్లంఘన గురించి తనకు తెలియదని చెబుతున్నాడు. అతడిని ప్రస్తుతం శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని బుద్గాం జిల్లా హుమ్హామా పోలీస్ పోస్టులో విచారిస్తున్నారు. అతడి పర్యటన వెనుక అసలు ఉద్దేశాన్ని రాబట్టేందుకు భద్రతా ఏజెన్సీలు ప్రయత్నిస్తున్నాయి.

## సాధారణ స్థితికి ఇండిగో సర్వీసులు : సీఈఓ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 9 :** దేశీయ విమానయాన సంస్థ ఇండిగోలో కొన్ని రోజులుగా సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ సమస్య పరిష్కారానికి చేస్తోన్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. సర్వీసుల రద్దు మంగళవారం కూడా కొనసాగినప్పటికీ.. కార్యకలాపాలు గాడిన పడుతున్నాయి. ఇదే విషయాన్ని ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. "మీ విమానయాన సంస్థ కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. అతిపెద్ద కార్యనిర్వాహక వైఫల్యం కారణంగా మిమ్మల్ని తీవ్రంగా నిరాశపరిచాం. అందుకు చింతిస్తున్నాం. లక్షలాది వినియోగదారులు వారి రీఫండ్లను పొందారు. ఆ ప్రక్రియను మేం కొనసాగిస్తున్నాం. విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన లగేజీని మీ ఇంటివద్దకు చేర్చాం. వినియోగదారుల అవసరాలను అనుగుణంగా వ్యవహరిస్తున్నాం. నిన్నటి నుంచి వందకుపైగా గమ్యస్థానాలకు మా సర్వీసులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వానికి మా సహకారం అందిస్తున్నాం. అసలు ఈ సమస్యకు గల కారణాలను గుర్తించడంపై ఇప్పటికే దృష్టిపెట్టాం. " అని పీటర్ వీడియో సందేశం విడుదల చేశారు

## విదేశీ వృత్తి నిపుణులకు రష్యా సరికొత్త వీసా

**రష్యా :** విదేశీ వృత్తి నిపుణులను ఆకర్షించేందుకు రష్యా సరికొత్త వీసాలను ప్రకటించింది. ఈ కొత్త వీసా కింద పలు రంగాల నిపుణులకు ఆ దేశంలో మూడేళ్లపాటు తాత్కాలిక లేదా శాశ్వత నివాసం పొందే అవకాశాన్ని కల్పిస్తోంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ పర్యటనకు ముందే పుతిన్ ఈ కార్యక్రమానికి సంబంధించిన ఉత్తర్వులపై సంతకాలు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయని మీడియాలో కథనాలు వస్తున్నాయి. భారత్– రష్యా మొబిలిటీ ఒప్పందాన్ని బలోపేతం చేసేందుకు ఆ దేశ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త వీసా కార్యక్రమం వచ్చే ఏడాది ఏప్రిల్ 15 నుంచి అందుబాటులోకి రానున్నట్లు ఓ అధికారి తెలిపారు. విదేశీయులు, వారి కుటుంబసభ్యులకు సైన్స్, ఆర్థిక, పారిశ్రామిక, విద్యా, సాంస్కృతిక, వ్యాపార, క్రీడలు వంటి పలు కీలక రంగాల్లో నిపుణులైన వారికి ఈ వీసాలు జారీ చేస్తామన్నారు. ఇమిగ్రేషన్ కోటాతో సంబంధం లేకుండా రష్యా భాషకు సంబంధించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించకపోయినా మూడేళ్లు తమ దేశంలో తాత్కాలిక నివాసం కోసం దరఖాస్తు చేసుకోవడానికి వీలు కల్పిస్తామన్నారు. ఈ వీసా కార్యక్రమం రెండు దశల్లో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. మొదట వీసా కోసం అభ్యర్థులు ఏజెన్సీల్లో అప్లై చేసుకోవాలి. ఆ తర్వాత వారు ఈ వీసా పొందేందుకు అర్హులో, కాదో అధికారులు గుర్తిస్తారు. అర్హులుగా నిర్ణయించిన వారికి మూడేళ్లపాటు రష్యాలో తాత్కాలిక, శాశ్వత నివాసం కోసం వారు దరఖాస్తు చేసుకునే



అవకాశం ఇస్తారు. ఏజెన్సీల ఆమోదం ఏడాది పాటు చెల్లుబాటు అవుతుంది. ఈ క్రమంలో విదేశీయులు ఇమిగ్రేషన్ అధికారులకు తమ దరఖాస్తులు సమర్పించాలి. స్వదేశాల్లో ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఏజెన్సీల్లో దరఖాస్తులు సమర్పించవచ్చు. వారికి ఆమోదం లభిస్తే.. అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు రష్యాలోకి వచ్చేందుకు ఒక ఏడాదికి గాను బిజినెస్ వీసాను మంజూరుచేస్తారు. ఈ క్రమంలో వారు ఈ కొత్త వీసా కార్యక్రమానికి దరఖాస్తులు సమర్పించాలి. తాత్కాలిక, శాశ్వత నివాసం కోసం అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తు పెండింగ్‌లో ఉంటే.. అలాంటి విదేశీయులకు, వారి కుటుంబసభ్యులకు వర్క్ పర్మిట్ పొందేందుకు అర్హులుగా గుర్తిస్తామని అధికారి తెలిపారు. వీరి దరఖాస్తులను ఇమిగ్రేషన్ అధికారులు 30 రోజుల్లోపు ప్రాసెస్ చేస్తారన్నారు.

## నన్ను కూర్చోబెట్టేది ఎవరు?

- మీ వల్లే వందేమాతరానికి అన్యాయం
- కాంగ్రెస్‌వి బుజ్జగింపు రాజకీయాలు
- ప్రతిపక్షాలపై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్
- లోక్‌సభలో సహనం కోల్పోయిన రక్షణ మంత్రి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 9 :** లోక్‌సభలో 'వందేమాతరం' గీతంపై జరిగిన చర్చ తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. చర్చ సందర్భంగా తన ప్రసంగానికి ప్రతిపక్ష సభ్యులు పదేపదే అడ్డుతగలడంతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "నన్ను కూర్చోబెట్టేది ఎవరు? ఎవరు కూర్చోబెడతారు?" అంటూ వారిపై విరుచుకుపడ్డారు. "ఏం మాట్లాడుతున్నారు మీరు... కూర్చోండి!" అని గట్టిగా హెచ్చరించారు. స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుని సభ్యులను శాంతపరచాల్సి వచ్చింది. సోమవారం లోక్‌సభలో 'వందేమాతరం' అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన బుజ్జగింపు రాజకీయాల కోసం జాతీయ గీతమైన 'వందేమాతరం'ను ముక్కలు చేసిందని తీవ్ర ఆరోపణలు చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ కాలం నుంచే ఈ అన్యాయం మొదలైందని విమర్శించారు. వందేమాతరం గీతానికి జరిగిన అన్యాయం కేవలం ఒక పాటకు మాత్రమే కాదని, యావత్ స్వతంత్ర భారత ప్రజలకు జరిగిందని ఆయన అన్నారు. అంతకుముందు, ప్రధాని నరేంద్ర మోదీ ఈ చర్చను ప్రారంభిస్తూ వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకోవడం చారిత్రాత్మకమని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఈ గీతం కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. వందేమాతరం వందేళ్లు పూర్తి చేసుకున్న సమయంలో కాంగ్రెస్ దేశంలో ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగాన్ని అణచివేసిందని విమర్శించారు. ఈ చర్చపై కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా స్పందించారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే బీజేపీ ఈ అంశాన్ని తెరపైకి తెచ్చిందని, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నమే ఇదని ఆరోపించారు. నెహ్రూను విమర్శించడానికి సమయం కేటాయించడం మానేసి, ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో చర్చించాలని ఆమె సూచించారు.



## విజయ్ సభ వద్ద కలకలం

### తుపాకీతో సభకు వచ్చిన వ్యక్తి

**పుదుచ్చేరి,డిసెంబర్ 9 :** పుదుచ్చేరిలో నటుడు విజయ్ ఏర్పాటు చేసిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) బహిరంగ సభ వద్ద కలకలం రేగింది. సభా ప్రాంగణంలోకి తుపాకీతో ప్రవేశించేందుకు యత్నించిన ఓ వ్యక్తిని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. అతడిని పార్టీ శివగంగై జిల్లా కార్యదర్శి ప్రభుకు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న డేవిడ్‌గా గుర్తించారు. ఈ ఘటనతో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషాదం తర్వాత విజయ్ నిర్వహిస్తున్న తొలి బహిరంగ సభ ఇదే కావడంతో పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎక్స్‌పో గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ సభకు పార్టీ అభ్యర్థన మేరకు కేవలం 5,000 మందిని మాత్రమే అనుమతించినట్లు సీనియర్ ఎస్పీ ఆర్. కలైవానన్ తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా పొరుగున ఉన్న తమిళనాడు నుంచి ప్రజలు రావద్దని పోలీసులు ముందే సూచించారు. సభా ప్రాంగణంలోకి పిల్లలు, గర్భిణులు, వృద్ధులకు ప్రవేశం నిరాకరించారు. పార్టీ జారీ చేసిన ప్రత్యేక క్యూఆర్ కోడ్ పాస్ ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించారు. తాగునీరు, అంబులెన్సులు, ప్రథమ చికిత్స బృందాలను సిద్ధంగా ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. అంతకుముందు విజయ్ రోడ్ షోకు అనుమతి నిరాకరించిన పోలీసులు, కేవలం సభకు మాత్రమే కఠిన షరతులతో కూడిన అనుమతినిచ్చారు.

## జపాన్‌లో భారీ భూకంపం..

- రిక్టార్ స్కేల్‌పై 7.2 తీవ్రత నమోదు
- భారీగా ఎగసిపడుతున్న రాకాసి అలలు

**హొక్కైడో, డిసెంబర్ 9 :** జపాన్ తీరంలో తీవ్ర భూకపం తలెత్తింది. భూకంపం తీవ్రత రిక్టార్ స్కేల్‌పై దాదాపు 7.2గా నమోదైంది. సముద్రం అలలు 10 అడుగుల మేర ఎగసిపడుతున్నాయి. దీంతో అక్కడి ప్రభుత్వం సునామీ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ఉత్తర జపాన్ అంతటా సునామీ హెచ్చరికలు జారీ చేయబడ్డాయి. జపాన్ తూర్పు తీరంలో సంభవించిన భారీ భూకంపం కారణంగా సునామీ హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 9.13 గంటల సమయంలో ఈ భూకంపం సంభవించింది. ఇది 30 మైళ్ల కంటే ఎక్కువ లోతులో కేంద్రీకృతమై ఉంది. దీంతో అక్కడి అధికారులు హొక్కైడో, అమోరి, ఇవాటే ప్రిఫెక్చర్ల పసిఫిక్ దీవులకు ముందస్తు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. అయితే యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే మాత్రం దీని తీవ్రత 7.6గా అంచనా వేస్తుంది. ఇది సాధారణంగా రాబోయే పెద్ద భూకంపాన్ని సూచించే సంకేతం. సాధారణంగా ఈ స్థాయి భూకంపాలు తలెత్తితే తీవ్రమైన నష్టాన్ని, గణనీయమైన విధ్వంసాన్ని, ప్రాణ నష్టాన్ని కలిగిస్తాయి. సునామీలు ఎంత వినాశకరమైనవో జపాన్‌కు బాగా తెలుసు. 2011 టోహోలో వచ్చిన భూకంపం, సునామీ విపత్తు చరిత్రలో అత్యంత దారుణమైన విపత్తులలో ఒకటి. దీని వలన 375 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. 20 వేల మంది మరణించినట్లు అంచనా. ఇది ఫుకుషిమా అణు ప్రమాదానికి సమానం. అంతర్జాతీయ అణు సంఘటన స్కేల్‌లో చెర్నోబిల్‌తో పాటు ఏడవ రేటింగ్ పొందిన ఏకైక సంఘటన ఇది. ఈ ప్రమాదం పరిణామాలు కనీసం 2051 వరకు కొనసాగుతాయని భావిస్తున్నారు.

## తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 9 :** ఎమ్మెల్యే హుమాయున్ కబీర్ తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలవడం ఇదేం కొత్త కాదు. మొన్నటికి మొన్న.. తృణమూల్ కాంగ్రెస్ ముస్లిం ఓటు బ్యాంకు ముగిసిపోతుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'పిక్చర్ అభి బాకీ హై' అంటూ కామెంట్లు చేయడం వివాదాస్పదంగా మారింది. హుమాయున్ కబీర్ నుంచి బాబ్రీ మసీదు ప్రకటన వెలువడిన వెంటనే పార్టీ నుంచి ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్టు టీఎంసీ ఓ ప్రకటన జారీ చేసింది. దీంతో డిసెంబర్ 22న కొత్త పార్టీని ఏర్పాటు చేయనున్నట్టు కబీర్ వెల్లడించారు. ఈ రాజకీయ పరిణామాల నడుమ తాజాగా కబీర్ బాబ్రీ మసీదు వ్యాఖ్యలు మరోసారి దుమారం రేపాయి. బాబ్రీ మసీదు విరాళాలకు సంబంధించి నిధులు ఒక్క రోజులోనే హుమాయున్ ఇంట్లో పేరుకుపోయినట్లు తెలుపుతున్నట్లు ఉన్న ఓ వీడియోని హుమాయున్ కబీర్ తన ఫేస్‌బుక్ ఖాతా నుంచి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. మొత్తం 11 ట్రంక్‌ల విరాళాలు సేకరించినట్లు హుమాయున్ కబీర్ ఈ సందర్భంగా తెలిపారు. కోడ్ ద్వారా అతని బ్యాంకు ఖాతాలో రూ.9.3 మిలియన్లు జమ చేసినట్లు.. అందుకోసం డబ్బును లెక్కించడానికి ముప్పై మందిని నియమించడానికి లెక్కింపు యంత్రాన్ని కూడా ఆ వీడియోలో చూపించారు. బీజేపీ నుంచి వచ్చిన నిధులతోనే తాను ఈ మసీదును నిర్మిస్తున్నానని అందరూ మాట్లాడుతున్నారని, అది అబద్ధం అని నిరూపించడానికే తన ఈ ప్రత్యక్ష వీడియో నిదర్శనమని హుమాయున్ చెప్పడం గమనార్హం. డబ్బు లెక్కింపు ప్రక్రియ సీసీటీవీ పర్యవేక్షణలో జరుగుతుందని, తన బాబ్రీ మసీదును విరాళంగా వచ్చిన డబ్బుతోనే నిర్మిస్తామని హుమాయున్ కబీర్ వెల్లడించారు.

## సిద్ధరామయ్య పూర్తికాలం సీఎం

### యతీంద్ర వ్యాఖ్యలపై వివాదాస్పద వ్యాఖ్యలు

**బెంగుళూరు, డిసెంబర్ 9 :** కర్ణాటక కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుమారుడు, ఎమ్మెల్సీ యతీంద్ర చేసిన వ్యాఖ్యలు, వాటిపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించిన తీరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే... ముఖ్యమంత్రి మార్పు ఉండదని, సిద్ధరామయ్య పూర్తికాలం పదవిలో కొనసాగుతారని, డీకే శివకుమార్ డిమాండ్‌ను అధిషా'నం తోసిపుచ్చిందని యతీంద్ర సోమవారం వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై ఈ రోజు బెంగళూరులో మీడియా ప్రశ్నించగా.. డీకే శివకుమార్ కేవలం "చాలా సంతోషం. అంతా మంచే జరగాలి, రాష్ట్రానికి మంచి జరగాలి" అని క్లుప్తంగా బదులిచ్చారు. ఆ తర్వాత, శీతాకాల సమావేశాల కోసం బెళగావి విమానాశ్రయానికి చేరుకున్న డీకే శివకుమార్‌కు మద్దతుదారులు "డీకే నెక్స్ట్ సీఎం" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మరోవైపు డీకే సన్నిహితురాలైన మంత్రి లక్ష్మీ హెబ్బాల్కర్ సోదరుడు, ఎమ్మెల్సీ చన్నరాజ్ హట్టిహొళి.. తన సోషల్ మీడియా ఖాతాలో డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రి అని సంబోధిస్తూ పోస్ట్ చేయడం కలకలం రేపింది. యతీంద్ర వ్యాఖ్యలు అనవసరమని చన్నరాజ్ అభిప్రాయపడ్డారు. సీఎం పదవిపై అధిషా'నం సరైన సమయంలో నిర?యం తీసుకుంటుందని చెప్పినప్పుడు, అంతవరకూ వేచి చూడాలని సూచించారు. ఈ పరిణామాలపై రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి స్పందిస్తూ, పార్టీలో ఎలాంటి గందరగోళం లేదని, అధిషా'నం నిర?యమే అంతిమమని స్పష్టం చేశారు. అయితే, నేతలు బహిరంగ ప్రకటనలు చేసేటప్పుడు బాధ్యతాయుతంగా ఉండాలని హితవు పలికారు. మొత్తం మీద నేతలు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. సీఎం కుర్చీ చుట్టూ ఇరు వర్గాల మద్దతుదారుల వ్యాఖ్యలు, నినాదాలు కరా?టక కాంగ్రెస్‌లో అంతర్గత పోరును మరోసారి బహిర్గతం చేశాయి.




## సంక్రాంతికి శర్వానంద్ మూవీ..

### 'రిలీజ్ టైమ్' ఫిక్స్.. ఎప్పుడంటే?

ఎప్పటిలానే 2026 సంక్రాంతికి బాక్సాఫీసు వద్ద ఆసక్తికర పోటీ ఉండబోతోంది. ముగ్గుల పండగకు వినోదం పంచేందుకు అగ్ర హీరోల సినిమాలతో పాటు చిన్న చిత్రాలూ విడుదలకు సిద్ధమవుతున్నాయి. వాటిలో ఒకటి 'నారీ నారీ నడుమ మురారి'. శర్వానంద్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమా విడుదల తేదీని నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ తాజాగా ప్రకటించింది. తేదీతోపాటు ఏ సమయానికి విడుదల చేయనున్నారో కూడా చెప్పారు మేకర్స్. జనవరి 14న సాయంత్రం 5:49 గంటలకు రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. అంటే.. మార్నింగ్, మ్యాట్నీలకు బదులు ఫస్ట్ షోతో జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'మోగ్లీ' సినిమా దర్శకుడికి అండగా సాయి ధరం తేజ్

బాలకృష్ణ 'అఖండ 2' అనుకున్న టైమ్ రిలీజ్ అయి ఉంటే ఈ వారం దాదాపు 15 కొత్త సినిమాలు థియేటర్లలో రిలీజ్ అయ్యేవి. అయితే అఖండ 2 మూవీ అనూహ్యంగా వాయిదా పడడం, రిలీజ్ డేట్ పై ఇంకా క్లారిటీ రాకపోవడంతో ఈ వారం సినిమాల రిలీజ్‌పై సందిగ్ధత నెలకొంది. ఒకవేళ 'అఖండ 2' డిసెంబరు 12న బాక్సాఫీసు ముందుకు వస్తే.. ఆ రోజు విడుదలయ్యేందుకు సిద్ధమైన పలు సినిమాలు వాయిదా పడే అవకాశాలున్నాయి. అందులో సుమ కుమారుడు రోషన్ హీరోగా నటించిన మోగ్లీ కూడా ఉంది. కలర్ ఫొటోతో జాతీయ అవార్డు అందుకున్న సందీప్ రాజ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. చాలా రోజులుగా కష్టపడి తెరకెక్కించిన మోగ్లీ సినిమా వాయిదా పడే అవకాశాలుండడంతో ఈ ట్యాలెంటెడ్ డైరెక్టర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. 'సినిమాపై ఎంతో ప్యాషన్ ఉన్న వ్యక్తులు ఈ ప్రాజెక్టులో భాగమయ్యారు. కలర్ ఫొటో, మోగ్లీ ఈ ఈ రెండు సినిమాలకు సంబంధించి రెండు కామన్ పాయింట్స్ ఏంటంటే.. 1. అంతా సవ్యంగానే జరుగుతోందని అనుకుంటే.. విడుదల విషయంలో దురదృష్టం ఎదురవడం. 2. నేను. నాదే 'బ్యాడ్‌లక్' అనుకుంటున్నా.. 'డైరెక్టెడ్ బై సందీప్‌రాజ్' అని సిల్వర్ స్క్రీన్ పై నా పేరు చూసుకోవాలన్న కల రోజు రోజుకూ కష్టతరమవుతోంది. . రోషన్, సరోజ్, సాక్షి, హర్ష, డీవోపీ మారుతి, మ్యూజిక్ డైరెక్టర్ కాల భైరవ.. ఇలా అంకిత భావం ఉన్న ఎంతోమంది కష్టంతో 'మోగ్లీ' రూపొందింది. వారి కోసమైనా ఈ సినిమా విషయంలో మంచి జరగాలని ఆశిస్తున్నా' అని తన ఆవేదనకు అక్షర రూపమిచ్చారు సందీప్ రాజ్. కాగా సందీప్ ట్వీట్‌పై మెగా హీరో సాయి దుర్గాతేజ్‌స్పందించారు. 'డియర్ సందీప్.. మీ కష్టానికి తగ్గ ప్రతిఫలం ఊహించని విధంగా దక్కుతుంది. ధైర్యంగా ఉండండి. మీ విషయంలో మీరు గర్వపడండి. చివరకు సినిమా గెలుస్తుంది' అని సందీప్ కు భరోసా ఇచ్చాడు సాయి దుర్గాతేజ్. ఇక బేబీ నిర్మాత ఎస్కేఎన్ స్పందిస్తూ.. 'డియర్ సందీప్.. జాతీయ అవార్డు చిత్రం 'కలర్ ఫోటో'లో మీరు ఒక భాగం. ఈ అడ్డంకులన్నీ తాత్కాలికం. దిగులు పడొద్దు. మీ కష్టాన్ని ప్రేక్షకులు గుర్తిస్తారు, మద్దతు ఇస్తారు. ఆల్ ది బెస్ట్' అని విషెస్ చెప్పారు.



# మార్చిలో సినిమా పండగే..




2025 క్లైమాక్స్‌లో ఉన్నాం. ఈ యేడాది జయాపజయాల జాబితా సిద్ధం అవుతోంది. ఈలోగా 2026 ప్రణాళికలు కూడా పటిష్టంగా తయారవుతున్నాయి. 2026 సంక్రాంతికి ఎలాంటి సినిమాలు వస్తున్నాయి అనేదానిపై ఓ స్పష్టత వచ్చేసింది. సంక్రాంతి తరవాత వేసవి సీజన్ చాలా కీలకం. ముఖ్యంగా మార్చి నుంచే హవా మొదలైపోతుంది. ఐపీఎల్ సీజన్ రసవత్తరంగా మారకముందే సినిమాల్ని విడుదల చేయడం మంచిదన్నది నిర్మాతల ఉద్దేశ్యం.

అందుకే మార్చి పై గట్టిగా గురి పెడుతున్నారు. 2026 మార్చిలో భారీ సినిమాలు రాబోతున్నాయి. ఈనెలని టార్గెట్ చేస్తూ టాలీవుడ్ లో చాలా సినిమాలు రెడీ అవుతున్నాయి. రామ్ చరణ్ 'పెద్ది' మార్చి ఆఖరి వారంలో తీసుకొద్దామనుకొంటున్నారు. మార్చి 27న ఈ చిత్రాన్ని విడుదల చేయాలన్నది ప్లాన్. సరిగ్గా అదే సమయానికి నాని 'పారడైజ్'ని తీసుకొద్దానుకొంటున్నాడు. ఈ రెండు సినిమాలూ ఒక రోజు వ్యవధిలో రావాల్సివుంది. అయితే.. 'పెద్ది' రిలీజ్ ఖాయ-ంమైపోతే.. పారడైజ్ ఓ వారం వెనక్కి లేదా ముందుకు వెళ్లే అవకాశం ఉంది. పవన్ కల్యాణ్ -ఉస్తాద్ భగత్ సింగ్- చిత్రాన్నీ మార్చిలోనే విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. చిత్రీకరణ కూడా దాదాపుగా పూర్తయ్యింది. కాబట్టి.. విడుదలకు ఎలాంటి ఢోకా






లేనట్టే. ఈరోజు నుంచే ప్రమోషన్స్ కూడా మెల్లగా మొదలెడతారు. ఫస్ట్ సింగిల్ పలకరించడానికి సిద్ధంగానే వుంది. మరోవైపు కన్నడ నుంచి 'టాక్సిక్' కూడా మార్చిలోనే విడుదల చేయాలని ఫిక్సయ్యారు. యష్ నటించిన సినిమా ఇది. తన నుంచి వచ్చిన 'కేజీఎఫ్', 'కేజీఎఫ్ 2' తెలుగులో ఎంతటి ప్రభావాన్ని చూపించాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మార్చి 19న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నామని నిర్మాతలు తాజాగా ప్రకటించారు. మొత్తానికి మార్చిలో ప్రతీ వారం ఓ భారీ సినిమా పలకరించడం ఖాయం. ఏప్రిల్, మేలలో కూడా ఇదే జోరు కొనసాగించే అవకాశం ఉంది. రెండు మూడేళ్లుగా సమ్మర్ సీజన్‌ని టాలీవుడ్ సరిగా వాడుకోలేదు. ఈసారి మాత్రం ఆ తప్పు చేయకపోవొచ్చు.



## మనసులో మాట చెప్పేసిన పాయల్ రాజ్‌పుత్

టాలీవుడ్ బ్యూటీ పాయల్ రాజ్‌పుత్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన పాయల్ రాజ్ పుత్ ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది. ఫస్ట్ మూవీనే బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో ఈ బ్యూటీకి వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. ఆ తర్వాత వెంకీ మామ, జిన్నా, తీస్మార్ ఖాన్, మంగళవారం, రక్షణ వంటి మూవీల్లో నటించి హిట్స్ తన ఖాతాలో వేసుకుంది. ఈ బ్యూటీ సినిమాలో నటించడంతో పాటు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటుంది. ఈ తరుణంలో తాజాగా పాయల్ చేసిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. "ఎవరైన అంత అమాయకంగా ఎలా ఉండగలరు" అంటూ రెబల్ స్టార్ ప్రభాస్ ఫొటోలను ట్విట్టర్ వేదికగా షేర్ చేసింది. ఈ వ్యక్తి ఇప్పటికీ సిగ్గుపడతాడు. ఎందుకు అతను అంత ముద్దుగా ఉంటాడు, దేవుడు అతన్ని దీవించుగాక అంటూ పోస్ట్ చేసింది" ఇది కాస్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు ఆసక్తికర కామెంట్స్ పెడుతున్నారు.



## జపాన్‌లో భూకంపం..

### ప్రభాస్ సేఫ్ అని క్లారిటీ ఇచ్చిన దర్శకుడు

ప్రస్తుతం ప్రభాస్ జపాన్‌లో ఉన్న విషయం తెలిసిందే. అయితే, తాజాగా జపాన్ ఉత్తర తీరంలో భారీ భూకంపం సంభవించడంతో ఆయన అభిమానులు ఆందోళన చెందుతూ పోస్ట్‌లు పెడుతున్నారు. వారికి దర్శకుడు మారుతి రిప్లై ఇచ్చారు. ప్రభాస్ క్షేమంగా ఉన్నారని తెలిపారు. 'జపాన్‌లో భూకంపం వచ్చింది. సునామీ హెచ్చరికలు జారీ చేశారు. మా హీరో ఎక్కడ ఉన్నాడు. ఈరోజు సాయంత్రం రిటర్న్ అవుతాడా?' అని ఓ అభిమాని మారుతిని అడుగుతూ పోస్ట్ పెట్టాడు. దీనికి ఆయన స్పందిస్తూ.. 'ప్రభాస్‌తో ఇప్పుడే మాట్లాడాను. భూకంపం వచ్చిన ప్రాంతంలో ఆయన లేరు. ఆయన క్షేమంగా ఉన్నారు. ఆందోళన చెందకండి' అని రిప్లై మారుతి పెట్టారు. దీంతో అభిమానులు ఊపిరి పీల్చుకు న్నారు. 'బాహుబలి: ది ఎపిక్' డిసెంబర్ 12న జపాన్‌లో విడుదల కానున్న సందర్భంగా ప్రచారంలో భాగంగా ప్రభాస్ అక్కడికి వెళ్లారు. అక్కడి అభిమానులతో కలిసి సందడి చేస్తున్నారు. ఇక మరోవైపు మారుతి-ప్రభాస్ కాంబోలో రానున్న 'ది రాజాసాబ్' ప్రచార పనులను షురూ చేసింది. ఈ మూవీ జనవరి 9న విడుదల కానుం ది. ఈ నేపథ్యంలో దీనిలోని రెండో పాటను త్వరలోనే రిలీజ్ చేయనున్నట్లు సమాచారం.

## అఖండ-2 విడుదలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో మోస్ట్ అవైటెడ్ సినిమాల్లో అఖండ 2 ఒకటి. భారీ అంచనాల మధ్య రూపొందించిన ఈ సినిమా విడుదల కోసం నందమూరి ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నందమూరి బాలకృష్ణ హీరో డైరెక్టర్ బోయపాటి శ్రీను ఈ మూవీని రూపొందించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేశాయి. ఇందులో బాలయ్య నట విశ్వరూపం చూపించనున్నారని ముందు నుంచి పోస్టర్స్, టీజర్ పై బజ్ క్రియేట్ చేశారు మేకర్స్. డిసెంబర్ 5న ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. అప్పటికే బాలయ్యతోపాటు చిత్రయూనిట్ సైతం జోరుగా ప్రమోషన్స్ నిర్వహించారు. కానీ చివరి క్షణంలో ఈ సినిమా విడుదలను వాయిదా వేశారు. ఫైనాన్షియల్ వివాదాల కారణంగా ఈ సినిమా రిలీజ్ అగిపోయింది. 14 రీల్స్ ఎంటర్టైన్మెంట్స్ నుంచి తమకు రావాల్సిన రూ. 28 కోట్ల బకాయిని చెల్లించేవరకు అఖండ 2 సినిమాను నిలిపివేయాలని బాలీవుడ్ నిర్మాణ సంస్థ ఈరోస్ ఇంటర్నేషనల్ మద్రాసు హైకోర్టును ఆశ్రయించింది. ఈరోస్ వాదనలతో ఏకీభవించిన కోర్టు అఖండ2 సినిమాపై స్టే విధించింది. ఇప్పుడు సినిమాకు సంబంధించిన ఫైనాన్షియల్ సమస్యలు అన్ని క్లియర్ అయ్యాయి. దీంతో అఖండ 2 సినిమా విడుదలకు మద్రాసు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పుడు ఈ చిత్రాన్ని వీలైనంత త్వరగా రిలీజ్ చేయాలని భావిస్తున్నారట మేకర్స్. ప్రస్తుతం ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం అఖండ



2 చిత్రాన్ని డిసెంబర్ 12న రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. రెండు తెలుగు రాష్ట్రాల్లో డిసెంబర్ 11న రాత్రి నుంచి ప్రీమియర్ షోలు పడనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ సినిమా విడుదల పై అధికారిక ప్రకటన రానున్నట్లు తెలుస్తోంది . ఈ చిత్రంలో సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుండగా.. తమన్ సంగీతం అందిస్తున్నారు.

## పవన్ కల్యాణ్ ఎవరికి తలవంచడు : జయసుధ

మెగా ఫ్యామిలీతో సహజ నటి జయసుధకు బలమైన అనుబంధం ఉంది. మెగాస్టార్ చిరంజీవి, నాగబాబుతోనే కాకుండా పవన్ కల్యాణ్‌తో కలిసి ఆమె పలు చిత్రాల్లో నటించారు. వారి మాదిరిగానే ఆమె కాంగ్రెస్ పార్టీలో కొనసాగి రాజకీయ జీవితాన్ని ముందుకు కొనసాగించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా సేవలు అందించారు. తాజాగా ఆమె రాజకీయాలకు దూరంగా ఉంటూ ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతున్నారు.సినిమా పరిశ్రమలో బలమైన పాత్రలు వేస్తూ నటిగా కొనసాగుతున్నారు. వివాదాలకు పూర్తిగా దూరంగా ఉండే ఆమె.. తాజాగా ఏపీలో ఓ ఈవెంట్‌లో పాల్గొన్న ఆమె పవన్ కల్యాణ్ వ్యక్తిత్వం గురించి, ఆయన ప్రొఫెషనల్ విజన్ గురించి మంచి మాటలు చెప్పారు. ప్రస్తుతం ఆ వీడియో వైరల్ అవుతున్నది. జయ-సుధ చెప్పిన మాటల విషయానికి వస్తే..పవన్ కల్యాణ్ వండర్‌ఫుల్ మ్యాన్. ఆయన యాటిట్యూడ్ విషయంలో యాక్టింగ్ ఉండదు. ఇప్పుడు డిప్యూటీ సీఎం అయినా.. అప్పుడు ఎలా ఉన్నాడో ఇప్పుడు అలానే ఉన్నాడు. ఆయనలో ఎలాంటి మార్పు లేదు. సినిమా రంగంలో ఎవరికీ తలవంచలేదు. రాజకీయ రంగంలో కూడా ఎవరికి తలవంచడం లేదు. తనకు ఓ స్టయిల్ ఉంది. తనకు కొన్ని సిద్దాంతాలు ఉన్నాయి. తనకు పట్టుదల ఉంది కాబట్టే రాజకీయాల్లో అందర్నీ ఎదురించి నిలబడగలిగాడు. పవన్ కల్యాణ్ కాకుండా వేరే వాళ్లు ఉంటే.. ఇప్పటికే వెళ్లిపోయి ఉండే వారు అని సహజ నటి జయ-సుధ అన్నారు. పవన్ కల్యాణ్ గురించి నాకు బాగా తెలుసు. ఆయన ఏదైనా అనుకొంటే మధ్యలో వదిలేసే రకం కాదు. ఆయన పడిన కష్టం. ప్రజా జీవితం పట్ల ఆయనకు ఉండే సిన్సియారిటీనే ఆయనను ఇంతవరకు తీసుకొచ్చాయి. ఆయన కమిట్‌మెంట్ చూసి ఆయనను అప్రిషియేట్ చేయాలి. ఎందుకంటే.. రాజకీయ రంగంలో కుళ్లును చూసి మనకెందుకులే అని వెళ్లిపోయి ఉండవచ్చు. కానీ అలా చేయలేదు అని జయసుధ అన్నారు. సినిమా రంగంలో ఆయన నటిస్తానని అంటే.. ఎంతైనా, ఏదైనా ఇవ్వడానికి నిర్మాతలు, దర్శకులు రెడీగా ఉన్నారు. కానీ వాటన్నింటిని వదులుకొని ప్రజా జీవితానికే మొగ్గు చూపారు. అందుకు ఆయనను అభినందించాలి. ఇవన్నీ నా వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే అని జయసుధ అన్నారు. పవన్ కల్యాణ్ మంచితనాన్ని జయసుధ ఆకాశానికి ఎత్తేసిన వీడియోను అభిమానులు సోషల్ మీడియాలో షేర్ చేసి ట్రెండ్ చేస్తున్నారు. పవన్ కల్యాణ్ విషయానికి వస్తే.. అటు రాజకీయ రంగంలోను, సినిమా రంగంలోను తనదైన ప్రభావాన్ని చూపుతున్నారు. నిత్యం ప్రజా సమస్యల



పరిష్కారంపై దృష్టి పెట్టడమే కాకుండా గతంలో తాను అంగీకరించిన సినిమాలను పూర్తి చేస్తున్నారు. ఇటీవల ఆయన నటించిన హరిహర వీరమల్లు, ఓజీ చిత్రాలు అభిమానులకు మంచి కిక్ ఇచ్చాయి. ప్రస్తుతం ఉస్తాద్ భగత్ సింగ్ అనే చిత్రంలో నటించారు. త్వరలోనే ఆ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్నది.

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

# అనిల్ అంబానీ తనయుడు అన్మోల్ అంబానీపై సీబీఐ కేసు



**ఢిల్లీ:** వ్యాపారవేత్త అనిల్ అంబానీ కుమారుడు జై అన్మోల్ అనిల్ అంబానీపై సీబీఐ కేసు నమోదు చేసింది. యూనియన్ బ్యాంక్‌కు రూ.228 కోట్ల మేర నష్టం వాటిల్లేలా చేసిన వ్యవహారంలో ఈ కేసు పెట్టింది. యూనియన్ బ్యాంక్ ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టింది. రిలయన్స్ హెూం ఫైనాన్స్ లిమిటెడ్‌కు డైరెక్టర్‌గా ఉన్న జై అన్మోల్ అంబానీతో పాటు రవీంద్ర శరద్ సుధాకర్‌పైనా కేసు నమోదు చేసినట్లు సీబీఐ అధికార వర్గాలు తెలిపాయి. ముంబయిలోని బ్రాంచ్ నుంచి రిలయన్స్ హెూంఫైనాన్స్ కంపెనీ రూ.450 కోట్లు రుణంగా తీసుకుంది. తిరిగి చెల్లించడంలో కంపెనీ విఫలమైంది. ఈ ఖాతాలపై గ్రాంట్ థోర్న్‌టన్ ఆడిట్ సంస్థ నిర్వహించిన ఫోరెన్సిక్ పరిశీలనలో నిధులు మళ్లించినట్లు తేలింది. 2016 ఏప్రిల్ 1 నుంచి 2019 జూన్ 30 వరకు మధ్య జరిగిన లావాదేవీలను జల్లెడ పట్టడంతో రుణంగా తీసుకున్న మొత్తాన్ని ఇతర అవసరాలకు వినియోగించినట్టు గుర్తించింది. ఈ వ్యవహారంపై బ్యాంక్ ఫిర్యాదు చేయడంతో సీబీఐ తాజాగా చర్యలు చేపట్టింది.




## కొనసాగిన స్టాక్ మార్కెట్ నష్టాలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అమెరికా ఫెడ్ ప్రకటన వేళ లాభాల స్వీకరణ కొనసాగింది. దీనికితోడు భారత్ నుంచి దిగుమతి అయ్యే బియ్యంపై టారిఫ్ విధిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. భారత్‌- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం వేళ ఈ ప్రకటన వెలువడడంతో అనిశ్చితి నెలకొంది. సెన్సెక్స్ ఓ దశలో 700 పాయింట్లకు పైగా నష్టపోయి తర్వాత కాస్త కోలుకుంది. సెన్సెక్స్ ఉదయం 84,742.87 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,102.69) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 84,382.96 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. తర్వాత కాస్త కోలుకుంది. ఆఖరికి 436.41 పాయింట్ల నష్టంతో 84,666.28 వద్ద ముగిసింది. నిఫ్టీ 120.90 పాయింట్ల నష్టంతో 25,839.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.88గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఏషియన్ పెయింట్స్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎటెర్నల్, టైటాన్, అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఎస్‌బీఐ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 62.71 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4206 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




# తొలి టీ20లో ఘన విజయం

## సఫారీలను వణికించిన భారత బౌలర్లు..

**కటక్:** సఫారీలతో వన్డే సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకున్న టీమ్‌ఇండియా.. అదే ఊపుతో ఐదు టీ20ల సిరీస్‌లో శుభారంభం చేసింది. కటక్ వేదికగా జరిగిన తొలి టీ20లో భారత్ 101 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 6 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ఈ లక్ష్యఛేదనలో సఫారీలు 12.3 ఓవర్లలో 74 పరుగులకే కుప్పకూలారు. డెవాల్డ్ బ్రెవిస్ (22) టాప్ స్కోరర్. మార్‌క్రమ్ (14), ట్రిస్టన్ స్టబ్స్ (14), మార్కో యాన్సెన్ (12) పరుగులు చేశారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. హార్దిక్ పాండ్య, శివమ్ దూబె తలో వికెట్ తీశారు. లక్ష్యఛేదనకు దిగిన సౌతాఫ్రికాకు భారత బౌలర్లు ఆరంభం నుంచే వరుస షాక్‌లు ఇచ్చారు. అర్ష్‌దీప్ వరుస ఓవర్లలో డికాక్ (0), స్టబ్స్‌ని వెనక్కి పంపాడు. ఈ క్రమంలో బ్రెవిస్ (14), మార్‌క్రమ్ (14) ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టే ప్రయత్నం చేశారు. కానీ, మార్‌క్రమ్‌ని క్లీన్‌బౌల్డ్ చేసి ఈ జోడీని అక్షర్ పటేల్ విడదీశాడు. తర్వాతి ఓవర్‌లోనే డేవిడ్ మిల్లర్ (1)ని హార్దిక్ ఔట్ చేశాడు. వరుణ్ చక్రవర్తి వరుస ఓవర్లలో డొనావన్ ఫెరీరా (5), యాన్సెన్ (12)ను పెవిలియన్‌కు పంపి కోలుకోలేని దెబ్బతీశాడు. తర్వాత బుమ్రా ఒకే ఓవర్‌లో బ్రెవిస్, కేశవ్ మహరాజ్ (0)ని ఔట్ చేశాడు. నోకియా (1)ని అక్షర్, లుథో సిపమ్లా (2) శివమ్ దూబె బౌలింగ్‌లో వెనుదిరగడంతో సఫారీల జట్టు ఆలౌటైంది. తొలుత భారత బ్యాటర్లలో హార్దిక్ పాండ్య (59లిబీ 28 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు అర్ధ శతకం బాదాడు. అక్షర్ పటేల్ (26), తిలక్ వర్మ (26) పరుగులు చేశారు. శుభ్‌మన్ గిల్ (4), అభిషేక్ శర్మ (17), సూర్యకుమార్ (12) తక్కువ స్కోరుకే వెనుదిరగడంతో భారత్ 48 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన హార్దిక్ పాండ్య దూకుడుగా ఆడాడు. అతను 25 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. సౌతాఫ్రికా బౌలర్లలో ఎంగిడి 3, సిపమ్లా 2, డొనావన్ ఫెరీరా ఒక వికెట్ పడగొట్టారు. సౌతాఫ్రికాకు టీ20ల్లో ఇదే అత్యల్ప స్కోరు. అంతకుముందు భారత్‌తోనే 2022లో జరిగిన మ్యాచ్‌లో 87 పరుగులకు ఆలౌటైంది.






## అనంత్ అంబానీకి గ్లోబల్ హ్యుమానిటేరియన్ అవార్డ్

**వాషింగ్టన్ :** వంతారా పేరిట వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్న అనంత్ అంబానీకి అరుదైన గౌరవం లభించింది. అమెరికాకు చెందిన గ్లోబల్ హ్యూమన్ సొసైటీ ఆయనకు గ్లోబల్ హ్యూమానిటేరియన్ అవార్డును ప్రదానం చేసింది. వన్యప్రాణుల సంరక్షణ కోసం ఆయన చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఈ అవార్డును అందజేసింది. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్న పిన్న వయస్కుడిగా, ఆసియాకు చెందిన మొదటి వ్యక్తిగా అనంత్ అంబానీ నిలిచారు. వాషింగ్టన్ డీసీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు ఈ అవా ర్డును ప్రదానం చేశారు. వన్యప్రాణుల సంరక్షణలో అత్యంత ప్రముఖంగా భావించే ఈ అవార్డు అనంత్ అంబానీకి దక్కడం ప్రాధాన్యం సంతరిం చుకుంది. గతంలో అమెరికా అధ్యక్షులుగా పనిచేసిన జాన్ ఎఫ్ కెన్నడీ, బిల్ క్లింటన్‌లకు ఈ అవార్డును ప్రదానం చేశారు. షెర్లే మెక్‌లైన్, జాన్ వేన్, బ్రెట్టీ వైట్ వంటి ప్రముఖ నటులనూ ఈ అవార్డు వరించింది. వంతారాను స్థాపించడంతో పాటు వన్యప్రాణులపై ఆయనకున్న ప్రేమ, కరుణ అనంత్ అంబానీకి ఈ అవార్డును తెచ్చిపెట్టాయి. వంతారాను అత్యుత్తమ వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంగా తీర్చిదిద్దమే కాకుండా.. వాటికి సకల సౌకర్యాలు, వైద్యం అందించడంలో అనంత్ అంబానీ అంకిత భావం కనిపిస్తోందని గ్లోబల్ హ్యూమన్ సొసైటీ అధ్యక్షుడు, సీఈఓ డాక్టర్ రాబిన్ గాంజెర్ట్ అన్నారు. వంతారా ద్వారా ఆయన ఓ బెంచ్‌మార్క్‌ను సృష్టించారని ఆమె కొనియాడారు.




## పోకో నుంచి 'బిగ్' ఫోన్

చైనాకు చెందిన షావోమీ సబ్‌బ్రాండ్ పోకో తన సీ సిరీస్‌లో మరో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. సీ85 5జీ పేరిట కొత్త ఫోన్‌ను భారత మార్కెట్‌లోకి విడుదల చేసింది. 50 ఎంపీ కెమెరా, బిగ్ డిస్‌ప్లేతో ఈ ఫోన్‌ను తీసుకొచ్చింది. బడ్జెట్ ధరలో ఫోన్ కోసం చూసేవారు దీనిపై ఓ లుక్కేయొచ్చు. ఈ ఫోన్ ఆండ్రాయిడ్ 15తో కూడిన హైపర్ ఓఎస్ 2.2తో వస్తోంది. 6.9 అంగుళాల ఫ్లాట్ హెచ్‌డీం డిస్‌ప్లే ఇచ్చారు. 120 రిఫ్రెష్ రేటు ఉంది. ఐపీ64 రేటింగ్‌తో కూడిన డస్ట్, స్ప్లాష్ రెసిస్టెన్స్‌తో వస్తోంది. మీడియాటెక్ డైమెన్‌సిటీ 6,300 చిప్‌సెట్ అమర్చారు. వెనకవైపు 50 ఎంపీ కెమెరా, క్యూవీజీఏ కెమెరా ఇచ్చారు. ముందువైపు సెల్ఫీల కోసం 8 ఎంపీ కెమెరా ఇచ్చారు. సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఇచ్చారు. ఇందులో 6,000 ఎంఏహెచ్ బ్యాటరీ ఇచ్చారు. ఇది 33%ఔ% ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. 10 రివర్స్ ఛార్జింగ్ సదుపాయం కూడా ఉంది. 5జీ, 4జీ ఎల్‌టీఈ, వైఫై 5, బ్లూటూత్ 5.4, 3.5 ఎంఎం ఆడియో జాక్, యూఎస్‌బీఐ టైప్‌-సి పోర్ట్ ఉన్నాయి. ఈ ఫోన్ మొత్తం మూడు వేరియంట్లలో లభిస్తుంది. 4జీబీం128జీబీ వేరియంట్ రూ.12,499, 6జీబీం128జీబీ వేరియంట్ ధర రూ.13,499, 8జీబీం128జీబీ వేరియంట్ ధర రూ.14,999గా కంపెనీ నిర్ణయించింది. పరిచయ ఆఫర్ కింద ఈ మోడళ్లను రూ.10,999, రూ.11,999, రూ.13,399కు కొనుగోలు చేయొచ్చని పేర్కొంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డులపై రూ.1000 డిస్కౌంట్ పొందొచ్చని తెలిపింది. డిసెంబర్ 16 నుంచి ఫ్లిప్‌కార్ట్ వేదికగా కొనుగోలు చేయొచ్చు. మిస్టిక్ పర్పుల్, స్ప్రింగ్ గ్రీన్, పవర్ బ్లాక్ రంగుల్లో లభిస్తుంది.


## ఐపీఎల్ వేలం నుంచి బీసీసీఐ ఎంతమంది ఆటగాళ్లను తొలగించిందంటే..?



ఐపీఎల్ 2026 లీగ్ ఆక్షన్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో 350 మంది ఆటగాళ్లు వేలంలోకి రానున్నారు. నమోదు చేసుకున్న ప్లేయర్ల జాబితా నుంచి బీసీసీఐ అనూహ్యంగా 1,005 మంది పేర్లను తొలగించింది. అలాగే 35 మంది కొత్త ఆటగాళ్ల పేర్లను చేర్చింది. '350 మంది ఆటగాళ్లకు సంబంధించిన ఆక్షన్ డిసెంబర్ 16 మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో అబుదాబీలో జరగనుంది' అని బీసీసీఐ.. ఐపీఎల్ ఫ్రాంచైజీలకు పంపిన మెయిల్లలో పేర్కొంది. మొదట బిడ్డింగ్ ప్రక్రియ.. బ్యాటర్లు, ఆల్ రౌండర్లు, వికెట్‌-కీపర్/బ్యాటర్లు, ఫాస్ట్ బౌలర్లు, స్పిన్ బౌలర్లు అనే విభాగాల వారీగా క్యాప్డ్ ఆటగాళ్లతో ప్రారంభమవుతుంది. తరువాత, అన్‌క్యాప్డ్ ఆటగాళ్లకు కూడా ఇదే వరుసక్రమంలో జరిగే అవకాశముంది. 'క్రిక్‌బజ్' నివేదిక ప్రకారం.. ఓ ఫ్రాంచైజీ క్వింటన్ డికాక్ పేరును జాబితాలో చేర్చమని కోరడంతో అతడికి జాబితాలో స్థానం దక్కినట్లు తెలుస్తోంది. దక్షిణాఫ్రికాకు చెందిన వికెట్ కీపర్/బ్యాటర్ డికాక్ గతంలో అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. కానీ మళ్లీ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాడు. ఇటీవల విశాఖపట్నం వేదికగా భారత్‌తో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో అతడు సెంచరీ చేసిన విషయం తెలిసిందే. రానున్న ఆక్షన్‌లో క్వింటన్ డికాక్ కనీస ధర రూ.కోటి ఉండనున్నట్లు సమాచారం. గత వేలంతో పోల్చుకుంటే అతడి ధర 50 శాతం తగ్గింది. అప్పుడు కోల్‌కతా నైట్‌రైడర్స్ అతన్ని రూ.2 కోట్లకు తీసుకుంది.

# ఆడవారికి ఆ మాత్రం గౌరవం ఇవ్వాలని తెలియదా?

### ఫొటోగ్రాఫర్లపై హార్దిక్ పాండ్య అసహనం



ఆసియా కప్‌లో గాయపడి జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్య దాదాపు రెండు నెలల తర్వాత తిరిగి మైదానంలో అడుగు పెట్టనున్నాడు. మరి కొన్ని గంటల్లో కటక్ వేదికగా టీమ్‌ఇండియా, దక్షిణాఫ్రికాతో తొలి టీ20లో తలపడనుంది. అయితే ఈ రోజు ముంబయిలో తన గర్ల్‌ఫ్రెండ్ మహికా శర్మకు కొందరు ఫొటోగ్రాఫర్ల వల్ల ఎదురైన ఇబ్బంది గురించి.. హార్దిక్ పాండ్య మంగళవారం ఇన్‌స్టాగ్రామ్‌లో స్టోరీ పోస్ట్ చేశాడు. 'సెలబ్రిటీలను నిత్యం ఉత్సుకతతో పరిశీలిస్తుంటారు. ఈ విషయాన్ని నేను అర్థం చేసుకోగలను. కానీ ఈ రోజు కొందరు హద్దులు దాటారు. మహికా శర్మ.. బాంద్రాలో ఓ రెస్టరంట్ దగ్గర నడుచుకుంటు వెళ్తోంది. అప్పుడు ఓ ఫొటోగ్రాఫర్.. ఆమె ఫొటోలను తీశాడు. అయితే ఆడవాళ్లు ఇబ్బంది పడేలా ఉన్న కోణంలో వాటిని తీశాడు. సెన్సేషనలిజం కోసం వ్యక్తిగత గోప్యతకు గౌరవం ఇవ్వడం లేదు. ఆడవాళ్లకు మనం కనీస మర్యాద ఇవ్వాలి. ప్రతి ఒక్కరికీ హద్దులుంటాయి' అని హార్దిక్ పాండ్య పేర్కొన్నాడు. అదే సమయంలో మీడియా వ్యక్తులు పడే కష్టం గురించి కూడా ప్రస్తావించాడు. 'ప్రతి రోజూ కష్టించి పనిచేసే మీడియా సోదరులకు ఓ విజ్ఞప్తి. మీ వృత్తిని నేను గౌరవిస్తాను. మీకు నిత్యం సహకరిస్తాను. కానీ మీ అందరినీ ఒకటే కోరుతున్నా. కాస్త విజ్ఞతతో వ్యవహరించండి. ప్రతి అంశాన్నీ ఫొటోలు తీయాల్సిన అవసరం లేదు. ప్రతి కోణాన్నీ మీ కెమెరాల్లో బంధించాల్సిన అవసరం లేదు. కాస్త మానవత్వం చూపించండి. థ్యాంక్యూ' అని హార్దిక్ పాండ్య రాసుకొచ్చాడు.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD**, **PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com